# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 19-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2011 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 279 | పేజీలు:4 | వెల: రూ.1/-


## భారత సైనికులే హద్దు మీరారట

### తమ సైన్యంపైనే భౌతిక దాడులకు దిగా
### కొత్తగా అసత్యాలు ప్రచారం చేపట్టిన డ్రాగన్

బీజింగ్,జూన్18(ఆర్ఎన్ఎ): భారత్–చైనా సరిహద్దులోని గాల్వన్ లోయలో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణపై డ్రాగన్ అసత్యాలు ప్రచారం చేస్తోంది. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)ని మొదటి భారత సైనికులు దాటారంటూ ఆరోపణలుకు దిగింది. కుట్రపూరితంగానే భారత సైనికులు తమ ఆర్మీపై భౌతిక దాడికి పాల్పడ్డారంటూ నిందలు మోపింది. ఈ మేరకు గురువారం చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జావో లిజియన్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాస్తవాధీన రేఖ వెంట చైనా ఆర్మీ సంయమనం పాటిస్తోందని, భారత సైనికులు దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారంటూ బుకాయించారు. సరిహద్దు వివాదాలపై ఇరు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిన తర్వాత కూడా భారత సరిహద్దు దళాలు నిబంధనలు ఉల్లంఘించాయని ఆరోపించారు. కాగా గాల్వన్ లోయ ఘర్ణణ అనంతరం కూడా ఆ ప్రాంతం తమదేనంటూ చైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసింది. ఈ వివాదం ముగియక ముందే భారత సైన్యంపై మరోసారి విషంకక్కింది. ఇక సరిహద్దుల్లో శాంతిని నెలకొల్పేందుకు ఇరు దేశాల మేజర్ జర్నల్ స్థాయి అధికారులు గురువారం సమావేశం అయ్యారు. కాగా తూర్పు లద్దాఖ్‌లోని గాల్వన్ లోయ ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య సోమవారం రాత్రి తీవ్రస్థాయిలో హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనలో 20 మంది భారతీయ సైనికులు అమరులయ్యారు.

## కరోనా సంక్షోభాన్ని అనుకూలంగా మార్చుకోవాలి

### బొగ్గు రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి
### భారత్‌ను అతిపెద్ద బొగ్గు ఎగుమతిదారుగా చేస్తాం: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): రాబోయే రోజుల్లో భారత్ విదేశీ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించుకోవాలని అనుకుంటోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఇందులో భాగంగా బొగ్గు సంస్కరణలపై కేంద్రం దృష్టి సారించిందని, విద్యుత్ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించబోతోందని అన్నారు. కరోనా సంక్షోభాన్ని భారత్ అవకాశంగా మల్చుకుంటోందని తెలిపారు. ప్రపంచంలోనే భారత్‌ను అతిపెద్ద బొగ్గు ఎగుమతిదారుగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 41 బొగ్గు గనుల వేలాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రారంభించారు. ఇంధన శక్తి రంగంలో భారత్ స్వావలంబనకు ఈ సంస్కరణలు ఉపయోగపడుతాయని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కోల్ సెక్టార్ పోటీతత్వానికి దూరంగా ఉందని, పారదర్శకత లోపించిందన్నారు. ఈ స్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు తాము అధికారంలోకి వచ్చాక 2014 తర్వాత అనేక చర్యలు చేపట్టామన్నారు. కమర్షియల్ కోల్ సెక్టార్ ద్వారా దేశంలో ఈ రంగం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రైవేట్ బొగ్గు గనుల ద్వారా ఆదివాసీ, గిరిజన ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అలాగే ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

కోల్ సెక్టార్‌లో ప్రైవేట్ పెట్టుబడులు అతిపెద్ద సంస్కరణగా మోదీ అభివర్ణించారు. ఇకపై కోల్ రంగంలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీనికి సంబంధించిన అడ్డంకులను కూడా తొలగించినట్టు తెలిపారు. దేశంలో 41 బొగ్గు గనులను ప్రైవేటీకరించడం ద్వారా రాబోయే ఐదు నుంచి ఏడేళ్లలో రూ.33వేల కోట్ల మూలధన పెట్టుబడులు పెరుగుతాయన్నారు. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా కొత్తగా 2.8లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

## ఆగని పెట్రోల్ మంటలు

### 12వ రోజూ పెరిగిన ధరలు

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): కరోనావైరస్‌తో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పడిపోయినా భారత్‌లో మాత్రం పెట్రో ధరలు భగ్గుమంటున్నాయి వరుసగా 12వ రోజు కూడా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేశాయి చమురు సంస్థలు. ఇవాళ లీటర్ పెట్రోల్‌పై 53 పైసలు వడ్డించగా... లీటర్ డీజిల్‌పై 64 పైసలు పెంచేశాయి.. దీంతో.. 12 రోజుల్లో ఏకంగా లీటర్ పెట్రోల్ ధర రూ ..6.55 పెరగగా.. లీటర్ డీజిల్ రూ .7.04 పెరిగింది.. ఇక తాజా ధరలను పరిశీలిస్తే.. ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.77.81, డీజిల్ రూ.76.43గా.. ముంబైలో పెట్రోలు ధర రూ. 84.66, డీజిల్ రూ.74.93గా.. చెన్నైలో పెట్రోలు ధర రూ.81.32, డీజిల్ ధర రూ.74.23గా.. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోలు ధర రూ.80.77, డీజిల్ ధర రూ.74.70గా ఉండగా.. అమరావతిలో లీటర్ పెట్రోల్ ధర రూ. 81.19?, డీజిల్ ధర రూ.75.18 కి చేరుకుంది.

## కొత్త మున్సిపాలిటీల్లో మరోమారు ఎల్ఆర్ఎస్

### మున్సిపల్ శాఖ కీలక నిర్ణయం
### మార్పుకనిపించేలా అభివృద్ధి జరగాలన్న కెటిఆర్

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం మరోమారు అనుమతి తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ప్రత్యేక ఎల్ఆర్ఎస్ వేళాల నిర్వహణకు పురపాలకశాఖ నిర్ణయం తీసుకుంది. కొత్త మున్సిపాలిటీలు, విలీనమైన గ్రామాలకు మాత్రమే ఈ ఎల్ఆర్ఎస్ వర్తించనుంది. ఎల్ఆర్ఎస్ అవకాశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి కేటీఆర్ ప్రజాప్రతినిధులను, అధికారులను ఆదేశించారు. కొత్త మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ వరకు ఎల్ఆర్ఎస్ గడువును పొడిగించింది. 43 కొత్త మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించింది. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట మున్సిపాలిటీలపై నగరంలోని ఎంసీహెచ్ ఆర్డీలో మంత్రి కేటీఆర్ నేడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్పు కనిపించేలా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. రోడ్లు, పచ్చదనం, శ్మశానవాటికల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో మెజార్టీ జనాభా పట్టణాల్లో ఉండే అవకాశం ఉన్నందున.. పట్టణాలను, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పౌర సేవలే కేంద్రంగా నూతన పురపాలక చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ చట్టంలోని విధులు కచ్చితంగా పాటించేలా అధికారులు పనిచేయాలన్నారు.

## భద్రతామండలిలో భారత్‌కు తాత్కాలిక చోటు

### సభ్య దేశాలకు కృతజ్ఞతలు చెప్పిన ప్రధాని మోడీ
### అభినందనలు చెప్పిన అగ్రరాజ్యం అమెరికా

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత తాత్కాలిక సభ్యత్వానికి మద్దతు తెలిపిన దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ సమాజం నుంచి లభించిన బృహత్తరమైన మద్దతుకు తాను గర్విస్తున్నానని ఆయన చెప్పారు.

ప్రపంచ శాంతి, భద్రత, సమానత్వం కోసం భారత్ ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలతో కలసి పనిచేస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో నూతన అధ్యక్షుడి ఎన్నికతోపాటు ఆర్థిక, సామాజిక మండళ్ల ఎన్నిక.. శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా భారత్ ఐక్యరాజ్యసమితి తాత్కాలిక సభ్యదేశంగా ఎన్నికైంది. మొత్తం 193 సభ్యదేశాల్లో 184 దేశాలు భారత సభ్యత్వానికి మద్దతు తెలిపాయి. దీంతో ప్రధాని నరేంద్రమోదీ భారత్‌కు మద్దతు పలికిన అన్ని దేశాలకు కృతజ్ఞతలు చెప్పారు. దీంతో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా భారత్ ఎన్నికైంది. 193 దేశాలు ఉన్న యూఎన్ జనరల్ అసెంబ్లీలో.. రెండేళ్ల పాటు భద్రతా మండలిలో భారత్ సభ్యదేశంగా ఉంటుంది. జూన్ 17వ తేదీ నుంచి భారత్‌కు ఆ హోదా దక్కింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి ఎన్నికైన భారత్‌కు.. అగ్రరాజ్యం అమెరికా అభినందనలు చెప్పింది. భారత్‌లో ఉన్న అమెరికా అంబాసిడర్ కెన్ జెస్టర్ దీనిపై స్పందించారు.

యూఎన్‌కు ఎన్నికైన భారత్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మరింత స్థిరమైన, భద్రమైన, దేదీప్యమాన భవిషత్తు కోసం భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కెన్ జెస్టర్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి ఎన్నికలో సహకరించిన ప్రతి దేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ థ్యాంక్స్ చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలో.. ప్రపంచ దేశాల బలోపేతానికి భారత్ కట్టుబడి పనిచేస్తుందని రాజ్‌నాథ్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. భద్రతా మండలి ఓటింగ్‌లో మొత్తం 192 దేశాలు పాల్గొన్నాయి. తాత్కాలిక సభ్యత్వం దక్కాంటే, రెండింట మూడో వంత మెజారిటీ అవసరం ఉటుంది. అంటే కేవలం 128 ఓట్లు వస్తే భారత్‌కు సరిపోతుంది. కానీ భారత్‌కు 184 ఓట్లు పోలయ్యాయి. భారత్‌తో పాటు ఐర్లాండ్, మెక్సికో, నార్వే దేశాలు కూడా భద్రతా మండలి ఎన్నికల్లో విజయం సాధించాయి. భద్రతా మండలిలో చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికా.. శాశ్వత సభ్యదేశాలుగా ఉన్నాయి. 2021–22 టర్మ్ కోసం ఆసియా పసిఫిక్ ప్రాంతం నుంచి భారత్.. తాత్కాలిక సభ్యదేశంగా ఎన్నికల్లో నిలిచింది.

## సికింద్రాబాద్ బస్ టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తాం: తలసాని

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): వందల సంవత్సరాల చరిత్ర ఉన్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్నబస్‌టెర్మినల్స్‌ను రూ.30కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇక్కడికి రోజుకు కొన్నిలక్షల మంది ప్రయాణీకులు వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా బస్‌టెర్మినల్స్ అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. గురువారం ఆయన సికింద్రాబా ద్‌లోని బస్టాప్, ఫుట్‌పాత్‌లు ఇతర పలు అభివృద్ధిపనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈసందర్భంగా అధికారు లకు పలు సూచనలు చేశారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ ఇక్కడి బస్‌స్టాప్‌లను అందంగా తీర్చిదిద్దాలని ఇక్కడ థీమ్‌పా ర్కులను ఏర్పాటు చేయాలని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సంకల్పించారని తెలిపారు. జీహెచ్ఎంసి, ట్రాఫిక్, ఇతర శాఖల సమన్వయంతో వీటిని అద్భుతంగా తీర్చిదిద్దుతు న్నట్టుచెప్పారు. ఇక్కడ బిచ్చగాళ్లను కూడా రూపువ ాపుతామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రతి ఒక్కరికీ ఉపాధి కలిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కేటీఆర్ మున్సిపల్‌శాఖ మంత్రి అయ్యాక గ్రేటర్ హైదరాబాద్‌లో చాలా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని మంత్రి వెల్లడించారు. దేశమంతా కరోనా సంక్షోభం ఉంటే ఇక్కడ హైదరాబాద్‌లో జీహెచ్ఎంసి లాక్‌డౌన్ పీరియడ్‌ను అద్భుతంగా వినియోగించుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. లాక్‌డౌన్‌ము గిశాక రోడ్లపైకి వచ్చిన జనం రోడ్లను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

## హిమచాల్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

### లోయలో పడ్డ జీపు: మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


సిమ్లా,జూన్18(ఆర్ఎన్ఎ): హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. . గురువారం సాయంత్రం ఐదుగురు వ్యక్తులతో వెళున్న జీపు అదుపుతప్పి కొండపై నుంచి పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో జీపు నుజ్జునుజ్జు కావడంతో మృతులు, క్షతగాత్రులు అందులోనే చిక్కుకుపోయారు. కిన్నౌర్ జిల్లాలోని న్యూగల్‌సారి ఏరియాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడినవారిని సిమ్లా జిల్లాలోని రాంపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను వెలికితీసి పోస్ట్ మార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని కిన్నౌర్ జిల్లా పోలీసులు తెలిపారు.

### చరిత్రలో నేటినిజం



సం॥ తేజము తో... చారు నవ్వులు
రాజిల్లెడి మోము తోడ... రంజన తోడవ
నా జాతకు పూజలు గాను
రాజీవుని తామరుడైన రాహుల గాంధీ!!

(జూన్ 19 రాహుల్ గాంధీ జననం..)



–రాధశ్రీ
సెల్: 9494481210

## కరోనాపై మరోమారు హైకోర్టు కీలక ఆదేశాలు

### రాష్ట్రవ్యాప్తంగా కరోనా పరీక్షలు పెంచాలని సూచన
### జీహెచ్ఎంసీ పరిధిలో వార్డుల వారీగా కేసులు వెల్లడించాలి
### టెస్టులు చేసే ఆస్పత్రులపై ప్రచారం చేయాలి

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): కరోనా పరీక్షల విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా కరోనా పరీక్షలు పెంచాలని ప్రభుత్వానికి సూచించింది. కరోనాపై కీలక సమాచారం మీడియా బులెటిన్‌లో ఉండాలని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కువ కేసులు నమోదవుతున్నందున? వార్డుల వారీగా కరోనా కేసులు వెల్లడించాలని హైకోర్టు తెలిపింది. జీహెచ్ఎంసీ కరోనా కేసుల వివరాలు కాలనీ సంఘాలకు కూడా ఇవ్వాలని సూచించింది.

ఇక ఐసీఎంఆర్ సూచించిన సూచనలు పరిగణలోకి తీసుకొని ర్యాపిడ్ యాంటీజెంట్ టెస్ట్ నిర్వహించాలని హైకోర్టు ఈ సందర్భంగా పేర్కొంది. అలాగే గాంధీతో పాటు 54 ఆస్పత్రుల్లో కరోనా చికిత్సలు జరుగుతున్నాయని ప్రచారం చేయాలని న్యాయస్థానం ప్రభుత్వానికి వెల్లడించింది. రాష్ట్రంలో కరోనా పరీక్షలపై గతంలో హైకోర్టు ప్రభుత్వాన్ని పలుమార్లు ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఇటీవల కరోనా పరీక్షలు ఎందుకు జరపడం లేదని ప్రభుత్వం తీరుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మృతదేహాలకు కరోనా పరీక్షలు ఎందుకు చేయడం లేదని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అనుమానితులకే కరోనా పరీక్షలు చేయాలని ఎందుకు నిర్ణయించారో తెలపాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్రం మార్గదర్శకాల ప్రకారమే వ్యవహరిస్తున్నామని హైకోర్టుకు ఏజీ తెలిపారు. లక్షణాలు ఉన్న వారికే పరీక్ష చేయాలని డబ్ల్యూహెచ్ఓ మార్గదర్శకాల్లో ఎక్కడుందని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.

సంచార పరీక్షలు ఎందుకు వీలుకాదో ప్రభుత్వం వివరించాలని హైకోర్టు ఈ సందర్భంగా పేర్కొంది. గాంధీ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో పాటు పోలీసులకు రక్షణ కిట్లు ఇవ్వాలని తెలిపింది. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లోని సిబ్బందికి గాంధీ తరహా షిఫ్ట్‌ల విధానం అమలు చేయాలని తెలిపింది. ఈ సందర్భంగా లక్షణాలు లేని ప్రైమరీ కాంటాక్టులకు పరీక్షలు నిర్వహించాలన్న ఐసీఎంఆర్ మార్గదర్శకాలను ఎందుకు అమలు చేయడం లేదని హైకోర్టు ప్రశ్నించింది. ఇక ఈ విచారణకు ప్రభుత్వం తరపున పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 79 మంది వైద్యులకు కరోనా సోకినట్లు శ్రీనివాసరావు హైకోర్టుకు తెలపగా.. గాంధీలో ఎ÷–లాస్మా, యాంటీ వైరల్ డ్రగ్స్ ప్రయోగాలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ వెల్లడించారు. వీటిపై స్పందించిన హైకోర్టు ఈనెల 29లోగా నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.


## కల్నల్ సంతోష్‌బాబుకు కన్నీటి వీడ్కోలు

### సొంత వ్యవసాయ క్షేత్రంలో పూర్తయిన అంత్యక్రియలు
### సైనిక, అధికార లాంఛనాలతో అంత్యక్రియల నిర్వహణ
### నివాళి అర్పించిన ప్రజాప్రతినిధులు, సైనికులు, అధికారులు
### చితికి నిప్పంటించిన తండ్రి ఉపేందర్
### భారీగా తరలివచ్చిన ప్రజలు
### అంతిమయాత్ర పొడవునా ప్రజల నినాదాలు

సూర్యాపేట,జూన్18(ఆర్ఎన్ఎ): సరిహద్దులో శత్రు సైన్యానికి ఎదురొడ్డి జాతి కోసం వీర మరణం పొందిన కల్నల్ సంతోష్ బాబు పార్థివదేహాన్ని అశ్రు నయనాలతో.. సైనిక, అధికార లాంఛనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. సంతోష్ తండ్రి ఉపేందర్ తనయుడి చితకి నిప్పంటించారు. మనవడు అనిరుధ్‌తో తలకొరివి పెట్టించారు. కేసారం వ్యవసాయ క్షేత్రంలో సైనికులు గౌరవార్థం గాల్లోకి









సూర్యాపేటలో కల్నల్ సంతోష్ బాబు ఇంటివద్ద ఆయన భౌతిక కాయం ముందు నివాళి అర్పించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు.
కల్నల్ సంతోష్ బాబు అంతిమయాత్రలో పాల్గొన్న అశేషజనవాహిని

మూడు రౌండ్ల కాల్పులు జరిపి నివాళులు అర్పించారు. జనం భారీగా తరలి వచ్చి వీరుడికి నివాళులర్పించారు. పలువురు రాజకీయ ప్రముఖులు కల్నల్ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి జగదీష్ రెడ్డి దగ్గరుండి అంత్యక్రియలకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశారు. కొవిడ్–19 నిబంధనలకు అనుగుణంగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. అంత్యక్రియలకు పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించారు. కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులకు మాత్రమే అనుమతి ఇచ్చారు. అయితే అంతిమయాత్రకు వందలాదిగా ప్రజలు తరలివచ్చి వ్యవసాయ క్షేత్రం బయట ఉండి కార్యక్రమాలను వీక్షించారు. సైనిక వాహనంపై భౌతిక కాయాన్ని ఊరేగింపుగా సంతోష్ వ్యవసాయక్షేత్రానికి తీసుకుని వచ్చిన తరవాత ఆర్మీబ్యాండ్ నివాళి అర్పించింది. సైనికులు కాల్పులుతో గౌరవ వందనం అందించారు.

సోమవారం రాత్రి గల్వాన్ లోయలో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుడు సంతోష్‌బాబుకు యావత్ ప్రజానీకం అశ్రునివాళి అర్పించింది. కల్నల్ సంతోష్‌బాబు అంతిమయాత్రలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. సూర్యాపేట సమీపంలోని స్వగ్రామం కేసారంలో సైనిక లాంఛనాలతో కల్నల్ సంతోష్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. సంతోష్ పార్థివదేహాన్ని ఆర్మీ అధికారులు చితివద్దకు తీసుకువచ్చారు. పార్థివదేహం చితి చుట్టూ కుటుంబసభ్యులు మూడు సార్లు తిరిగి నివాళి అర్పించారు. వీరజవాన్‌కు నివాళిగా జవాన్లు గాల్లోకి మూడుసార్లు తూటాలు పేల్చి.. గౌరవ వందనం సమర్పించారు. ఆపై సంతోష్‌బాబు సతీమణి, కుమారుడు, బంధువులు, ప్రజలు సెల్యూట్ చేశారు. కుమారుడు సంతోష్‌బాబు చితికి తండ్రి ఉపేందర్ నిప్పుపెట్టడంతో అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి జగదీశ్ రెడ్డి, ఎంపీలు లింగయ్య యాదవ్, ఉత్తమ్ కుమార్ దంపతులు, బండి సంజయ్, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, ఎమ్మెల్యేలు కిషోర్ కుమార్, సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, తదితరులు సంతోష్‌బాబు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంతోష్ అంతిమయాత్రలో పాల్గొనేందుకు ప్రజలు భారీగా తరలిరావడంతో సూర్యాపేట జన సంద్రంగా మారింది. యుద్ధవీరుడా జోహార్లు అంటూతెలంగాణ ప్రజానీకం కన్నీటి నివాళి అర్పించింది. ఒక్కొగానొక్క కొడుకును సైన్యంలోకి పంపిన వీరుడి కుటుంబానికి జేజేలు పలికింది. మౌనంగా రోదిస్తున్న అమరుడి భార్యను.. తామంతా అండగా ఉన్నామంటూ యావత్ దేశం ఓదార్చింది. సంతోష్ బాబు అమర్ రహే అంటూ బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమర జవాన్ బలిదానానికి మద్దతుగా సూర్యాపేటలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. సరిహద్దు నుంచి కల్నల్ సంతోష్ బాబు పార్థివదేహం బుధవారం పొద్దుపోయాక హైదరాబాద్ చేరుకుంది. ప్రత్యేక విమానంలో హకీంపేట ఎయిర్ బేస్‌కు చేరుకున్న సంతోష్ పార్థివదేహానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, జగదీష్ రెడ్డిలు నివాళి అర్పించారు. సంతోష్‌బాబు మృతదేహం రాగానే ఆయన భార్య కన్నీటి పర్యంతమయ్యారు. తీవ్రమైన దుఃఖంలో ఉన్న ఆమెను గవర్నర్‌తోపాటు మంత్రులు ఓదార్చారు. అనంతరం హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి కల్నల్ సంతోష్ బాబు పార్థివదేహం రోడ్డు మార్గం ద్వారా సూర్యాపేటకు తరలించారు. భౌతికకాయాన్ని పట్టణంలోని విద్యానగర్ నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాసరబాద వరకు ర్యాలీగా తీసుకువెళ్లారు. ఇందులో ఆర్మీ, సంతోష్‌బాబు బంధువులు మినహా ఎవరినీ అనుమతించలేదు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు. ప్రభుత్వ లాంఛనాలతో ఆర్మీ అధికారులు అంత్యక్రియలు పూర్తి చేస్తున్నారు. దేశ రక్షణలో ప్రాణాలు విడిచిన సంతోష్‌బాబు ఆత్మకు శాంతిచేకూరాలని అంతా ఆకాంక్షించారు.


## కల్నల్ సంతోష్‌బాబు పేరు చిరస్థాయిగా నిలిచేలా చేస్తాం

### సూర్యాపేటలో స్మారక కేంద్రం నిర్మిస్తాం

సూర్యాపేట,జూన్18(ఆర్ఎన్ఎ): కల్నల్ సంతోష్ బాబు జ్ఞాపక చిహ్నంగా కేసారాన్ని మారుస్తామని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. కర్నల్ సంతోష్ బాబుకు మంత్రి జగదీష్ రెడ్డి అశ్రునయనాలతో కడసారి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రధాన కూడలికి సంతోష్ బాబు పేరు పెడుతామన్నారు. కర్నల్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే వారి కుటుంబ సభ్యులకు సందేశం పంపారు. వారి పిల్లల చదువులు, కుటుంబ సభ్యులకు ప్రభుత్వం బాసటగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా, మంత్రి జగదీశ్‌రెడ్డి సీఎం కేసీఆర్ సూచనల మేరకు హైదరాబాద్ నుంచి కర్నల్ భౌతికకాయం తరలింపు మొదులుకొని అంత్యక్రియలు పూర్తయ్యే వరకు దగ్గరుండి పక్కాగా నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారన్నారు. ఆయన త్యాగం, ధైర్య సాహసాలు, తెగువ నేటి యువతకు ఆదర్శప్రాయని చెప్పుకొచ్చారు. ఏమి ఇచ్చినా ఆయన రుణం తీర్చుకోలేమన్నారు. సంతోష్ బాబు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా సూర్యాపేట పట్టణంలోని ప్రధాన కూడలికి ఆయన పేరు పెట్టి అభివృద్ధి చేసి గౌరవించుకుంటామని మంత్రి జగదీష్ ప్రకటించారు. ఆయన అంత్యక్రియలు జరిగిన ప్రాంతాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తామన్నారు. సంతోష్ బాబు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని...వారి పిల్లలు ఉన్నత చదువులు చదువుకోడానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు సంతోష్ బాబు అంత్యక్రియలకు సూర్యాపేట ప్రజలు భారీగా తరలివచ్చారు. సంతోష్‌కు కడసారి కన్నీటి వీడ్కోలు పలుకుతూ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంటర్ ఫలితాల వెల్లడి

### ఫలితాల్లో హవా చాటిని బాలికలు
### ఇంటర్ ఫస్టియర్‌లో .60.01 ఉత్తీర్ణత
### ఇంటర్ సెకండియర్‌లో 68.86 శాతం ఉత్తీర్ణత
### ఫస్టియర్‌లో మేడ్చెల్.. సెకండియర్‌లో కుమ్రం భీమ్ జిల్లాల ముందంజ
### ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చిన బోర్డు
### ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఫలితాలు విడుదల చేసిన మంత్రి సబిత





హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 4 లక్షల 80 వేల 516 మంది హాజరు కాగా...60.01 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 75 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలబడింది. ఇక రెండో స్థానంలో 71 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి, కుమ్రంభీం జిల్లాలు చోటు దక్కించుకున్నాయి. ఇక సెకండియర్‌లో 4 లక్షల 85 వేల 323 మంది విద్యార్థులు హాజరు కాగా... 68.86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. 76 శాతం ఉత్తీర్ణతతో కుమ్రంభీం తొలి స్థానంలో నిలబడింది. 75 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ రెండో స్థానం దక్కించుకుంది. మొత్తం 25 వేల మంది ఇన్విజిలేటర్లు హాజరు కాగా... 9 లక్షల 65 వేల 839 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారని మంత్రి ప్రకటించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలను నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేశారు. గత మార్చి నెలలో జరిగిన ఈ పరీక్షలకు 9.65 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫస్టియర్‌లో 60.4 శాతం, సెకండియర్‌లో 68.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎప్పటిలాగానే ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. ఫస్టియర్‌లో బాలికలు 67 శాతం, బాలురు 52.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో బాలికలు 75.15, బాలురు 62.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇంత ఉత్తీర్ణత శాతం రావడం ఇదే తొలిసారి అన్నారు. ఈ నెల 22 వరకు కాలేజీలకు మార్కుల మెమోలు అందనున్నట్లు తెలిపారు. రీ వాల్యుయేషన్, రీ కౌంటింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థులెవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఒత్తిడికి గురైతే మానసిక నిపుణులను సంప్రదించాలన్నారు. ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో ఏడుగురు మానసిక నిపుణులను నియమించినట్లు వెల్లడించారు. త్వరలోనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల తేదీలను ప్రకటించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# బుద్ధుడి శాంతిని విస్మరించిన రక్తపిశాచి చైనా !

నేటి నిజం
శుక్రవారం 19-6-2020

కరోనా వ్యాప్తితో చైనా కుత్సిత బుద్ది ప్రపంచానికి తేటతెల్లం అయ్యింది. బౌద్ధం బాగా వ్యాపించిన ఆ దేశం శాంతికి బదులు రక్తపాతం కోరుకుంటోంది. తియాన్మెన్ స్క్వేర్ వద్ద వేలాదిమంది విద్యార్థుల ప్రాణాలను తీసేందుకు కూడా వెనకాడని ఉగ్రమూకల చేతుల్లో అక్కడ పాలన సాగుతోంది. మావో ఆలచానా విధానాలు కూడా రాజ్యకాంక్షను ప్రేరేపించేవిగానే అక్కడ పాతుకుపోయాయి. అధికార కాంక్ష, రాజ్యకాంక్ష చైనా ఎజెండా. టిబెట్‌ను ఆక్రమించుకోవడం, భారత సరిహద్దులను ఆక్రమించుకోవడం, హాంగ్‌కాంగ్‌ను గుప్పిట్లో పెట్టుకోవడం, తైవాన్ మాదే అంటూ హుంకరించడం చూస్తుంటే..నిజంగా చైనాలో బుద్దిజం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా పైచేయి సాధించాలన్న దాని దుర్బిద్ధిలోంచి పుట్టిందే కరోనా..కరోనాతో ప్రపంచ దేశాలను అతలాకుతలం చేసి ఆనందిస్తోంది. ఇది చాలదన్నట్లు భారత్‌ను ఎలా దెబ్బతీయాలన్న కుట్రలకు పదను పెడుతోంది. ఎప్పుడూ శాంతికాముక దేశంగా ఉన్న భారత్‌ను దెబ్బతీసేందుకు బహుముఖ వ్యూహాలు అనుసరిస్తోంది. బౌద్ధంతో శాంతి సందేశానికి కట్టుబడి ఉన్న వేదభూమి భారత్ ఇప్పటికే వందల ఏళ్లు విదేశీ పాలకుల దాడులతో చితికి పోయింది. అలాగే దేశాన్ని విడగొట్టినా తలెత్తుకుని నిలుచుంది. అన్నిరంగాల్లో దూసుకుని పోతోంది. ఈ దశలో అమెరికాతో సాన్నిహిత్యం, ప్రపంచ దేశాల్లో కొత్త స్నేహం...కరోనాపై ప్రపంచదేశాలకు అండగా నిలవడం వంటి చర్యల తో చైనాకు నిద్దరపట్టడం లేదు. అందుకే తన ఎత్తుగడలను అమలు చేసే విధంగా కుట్రలను పన్నుతోంది. గత కొన్నేళ్లుగా మోడీ ప్రధాని అయ్యాక స్నేహం నటిస్తూనే కుట్రలకు తెరతీస్తోంది. తాజాగా 20మంది భారత సైనికులను పొట్టన పెట్టుకున్న తీరు దీనికి పరాకాష్టగా చెపపుకోవాలి. రాళ్లు,రాడ్లతో దాడిచేసి సైనిక బలగాలపై దాడి చేసి చంపడం దాష్టీకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. భారత్–చైనా మధ్య సరిహద్దు వివాదం నేపథ్యంలో డ్రాగన్ సరికొత్త ఎత్తుగడలకు కుట్రపన్నుతోంది. భారత్‌ను దెబ్బతీసేందుకు త్రిముఖ వ్యూహాన్ని అమలు చేసేలా ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగానే భారత్‌తో సరిహద్దు వివాదాలు నెలకొన్న పాకిస్తాన్, నేపాల్‌ను రంగంలోకి దించాలని భావిస్తోంది. ఓవైపు పాక్‌ను ఎగదోస్తూ ఆక్రమిత కాశ్మీర్‌లో భూ ఆక్రమణలకు తెగించింది. అక్కడ రోడ్ల నిర్మాణాలు చేస్తూ భారత్‌ను ఎదుర్కొనే వ్యూహాలు రచిస్తోంది. అలాగే పాక్ ఉగ్రవాదులను ఎనకేసుకుని వస్తోంది. ఇక శతాబ్దాలుగా నేపాల్‌తో ఉన్న బంధంలో చిచ్చు పెట్టేలా ఇటీవలయ యత్నాలు మొదలు పెట్టింది. లద్దాఖ్ రీజియన్‌లోని వివాదాస్పద అక్సాయ్ చిన్ ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణలో 20 మంది భారత సైనికులు అసువులు బాయగా, కొందరు చైనా సైనికులు గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌కు చైనా హెచ్చరికలు పంపింది. భారత్ తమపై దాడికి దిగితే అదే సమయంలో పాకిస్తాన్, నేపాల్ నుంచి ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని హెచ్చరించింది. చైనాతో యుద్ధమంటే పాకిస్తాన్, నేపాల్ నుంచి కూడా మిలటరీని ఎదుర్కొక తప్పదంటూ చేసిన హెచ్చరికలు దాని దాష్టీకానికి పరాకాష్టంగా చూడాలి. ఇది బుద్ధుడి శాంతి ఆలోచనలు తుంగలో తొక్కు తున్న దేశంగా చూడాలి. ఆయా దేశాలతో ఇప్పటికే సరిహద్దు వివాదం తారాస్థాయికి చేరినా తమ మిత్ర దేశాలతో పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకుని భారత్ తమపైకి దాడి చేసే సాహసం చేయదన్న ధీమాలో చైనా ఉంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియధుర ప్రాంతాల కోసం భారత్, నేపాల్‌ల మధ్య నెలకొన్న వివాదాన్ని చైనాయే రెచ్చగిట్టింది. అలాగే పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్, జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు, కశ్మీరీల హక్కులు, పాక్‌తో సరిహద్దు వివాదాలను సైతం చైనా పదేపదే రెచ్చగొడుతోంది. అందుకే సరిహద్దుల్లో భారత్‌ను ఎదుర్కోవాల్సి వస్తే అటు పాక్, ఇటు నేపాల్‌ల నుంచి కూడా భారత్ దాడులను ఎదుర్కోక తప్పదన్న హెచ్చరిక చేయడం దాని జిత్తులమారి తనానికి నిదర్శనంగా చూడాలి. మూడు వైపుల నుంచి భారత్‌పై దాడికి పాల్పడే అవకాశం తమకుంటుందని జిత్తులమారి చైనా చెప్పకనే చెప్పింది. ఇటీవలే నేపాల్‌ను భారత్‌పైకి ఉసిగొల్పిన విషయం తెలిసిందే. లిపులేఖ్, కాలాపానీ, లింపియధురలను నేపాల్ భూభాగంలో ఉన్నట్లు చూపించే కొత్త మ్యాప్‌కు ఆ దేశ కేబినెట్ ఆమోదం తెలిపి భారత సహనాన్ని పరీక్షిస్తోంది. ఈ క్రమంలోనే భారత్–చైనా మధ్య సరిహద్దు వివాదం తీవ్ర రూపం దాల్చడంలో వీటన్నింటినీ తనకు అనుకూలంగా మార్చుకునేందుకు డ్రాగన్ కుట్రలు పన్నుతోంది. ఈ మేరకు పాకిస్తాన్, నేపాల్ దేశాలతో ఇప్పటికే మంతనాలు జరిపినట్లు కూడా తెలుస్తోంది. కాగా పాకిస్తాన్, నేపాల్ ఎప్పటి నుంచో చైనా అనుకూల దేశాలుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇక కరోనా వైరస్ విషయంలో చైనాను ఒంటరిపక్షి చేయాలన్న అమెరికా పిలుపునకు ప్రపంచ దేశాలన్ని సానుకూలంగా స్పందించాయి. దానికి భారత్ కూడా మద్దతుగా నిలచింది. ఆస్ట్రేలియా పిలుపు మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సైతం భారత్ మద్దతు ప్రకటించింది. ఈ పరిణామం చైనాకు కంటగింపుగా మారింది. భారత్‌ను ఎలానైనా దెబ్బతీయాలని సరిహద్దుల్లో గిల్లికజ్జాలుకు దిగుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే శాస్త్ర,సాంకేతిక రంగాలతో పాటు ఆర్థికంగా భారత్ పురోగమించడాన్ని చైనా జీర్ణించుకోవడం లేదు. అందుకే పైకి మోడీతో స్నేహం నటిస్తున్న జిన్‌పింగ్ లోలోపల కుట్రలకు తెర తీస్తున్నారు. రాజ్యకాంక్ష నరనరాన జీర్ణించుకున్న ఈ కమ్యూనిస్టు దేశంతో ప్రపంచానికి కీడే తప్ప మేలు లేదు. కరోనాతో ఇది అన్ని దేవాలకు అనుభవంలోకి వచ్చింది. కరోనా కారణంగా నష్టపోయిన దేశాలన్నీ చైనాను నిలదీసి ప్రపంచ కోర్టులో నిలబెట్టాలి. పరిహారం రాబట్టి దానిని కట్టడి చేయాలి. అప్పుడే ప్రపంచానికి శాంతి కలుగుతుంది.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై నిషేధాజ్ఞలు కొనసాగింపు

### – కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, జూన్ 18 (నేటినిజంప్రతినిధి):సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈనెల 26వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది. మద్యంప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

డిజెలపై నిషేధాజ్ఞలు పొడగింపు

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో డిజె సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈనెల 26వరకు పొడగించడం జరిగిందని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డిజె సౌండ్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు విధించడం జరిగిందని పేర్కొన్నారు.

వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డిజె సౌండ్‌లను వినియోగిస్తున్న విషయం విదితమే. కమీషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. నిషేధాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## మానాన్నచనిపోయాడంటూ దుష్ప్రచారం

### –డాక్టర్ రమేశ్ కొడుకు వరుణ్ వీడియో సందేశం

వరంగల్,జూన్18(ఆర్ఎన్ఎ): హన్మకొండలో ప్రముఖ చర్మ వైద్యుడు డాక్టర్ వీ.రమేష్ కరోనా వైరస్ వల్ల చనిపోయారని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కుమారుడు డాక్టర్ వరుణ్ ఖండించారు. ఆయన వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు. తన తండ్రి చనిపోయాడని సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందని, అలాంటి వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ప్రచారాలతో తమను ఇబ్బందిపెట్టేలా చేయవద్దన్నారు. ప్రస్తుతం తన తండ్రి చికిత్స పొందుతున్నారని త్వరలోనే కోలుకుంటారని వరుణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక ఈ విషయమై డాక్టర్ రమేష్ సైతం ఓ వీడియో సందేశాన్ని ఇచ్చారు. తాను ఆరోగ్యంగానే ఉన్నానని తనపై వచ్చే వదంతులన్నీ అవాస్తవమని ఆసుపత్రి బెడ్ పై నుంచే వీడియో ద్వారా వ్యక్తం చేశారు. తాను తొందరలోనే కోలుకుంటానని, మళ్లీ తన విధులు నిర్వహిస్తానని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు.

## లాక్‌డౌన్ లేకుంటే బతివాడు.

### -కడసారి నివాళి కోసం తరలివచ్చిన జనం

సూర్యాపేట,జూన్18(ఆర్ఎన్ఎ): కోరుకొండ సైనిక స్కూల్లో చదువుకున్న సంతోష్ బాబు తండ్రి కోరిక మేరకు ఆర్మీలో చేరారు. చిన్న వయసులో కల్నల్ స్థాయి వరకు ఎదిగారు. లద్దాఖ్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో రెండు నెలల క్రితమే హైదరాబాద్‌కు బదిలీ అయినా లాక్ డౌన్ కారణంగా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. చివరికి చైనా దాడిలో ప్రాణాలు కోల్పోయారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ జవాన్లు భారత

సైనికులతో గొడవకు దిగడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులను తగ్గించేందుకు సంతోష్ బాబు ప్రయత్నించారు. ఓ వైపు మాట్లాడుతుండగానే సంతోష్ బాబుపై చైనా జవాన్లు దాడికి దిగారు. దీంతో రెండు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తలెత్తినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. కాగా కల్నల్ సంతోష్‌బాబు స్వస్థలం సూర్యాపేట కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. పట్టణంలోని వ్యాపారులు, స్వచ్ఛంధంగా బంద్ పాటించారు. అంతకుముందు సంతోష్‌బాబు ఇంటివద్ద ఆయన పార్థివదేహానికి మంత్రి జగదీశ్ రెడ్డి, ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. సంతోష్ బాబు అమర్ రహే అంటూ అంతిమయాత్ర ప్రారంభమైంది. యాత్ర వెంబడి రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిలబడి వీర సైనికుడికి నివాళలర్పించారు. పూల వర్షం కురిపించారు. సంతోష్ కుమార్ అంత్యక్రియలకు భారీగా హాజరైన జనం తుది నివాళి ప్రకటించారు.

## సుజాతానగర్ టీఆర్ఎస్‌లో విభేదాలు

### –స్థానిక నేతల్లో ఫ్లెక్సీల గొడవ

భద్రాద్రి కొత్తగూడెం,జూన్18(ఆర్ఎన్ఎ): అధికార పార్టీ టిఆర్ఎస్ లో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పర్యటించాల్సి ఉంది. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీకి చెందిన జలగం వెంకట్రావు అభిమానులు సీఎం కేసీఆర్, కేటీఆర్ , పువ్వాడ అజయ్, ఎంపీ నామా నాగేశ్వరరావుల ఫోటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్లెక్సీలను స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అనుచరులు చించేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లెక్సీల తొలగింపుపై సమాచారం అందుకున్న జలగం వెంకట్రావు అభిమానులు.. ఎమ్మెల్యే వనమా పై మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం నుండి టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం, అభ్యర్థుల గెలుపు కోసం పని చేశామని కానీ ఇతర పార్టీ నుంచి వచ్చి వచ్చిన ఎమ్మెల్యే వనమా అతని కుమారుడు రాఘవేంద్ర రావు అనుచరులు తమని పట్టించుకోవడం లేదని, అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్ సుజాత నగర్ పర్యటన సందర్భంగా తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంపై తాము పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని జలగం వెంకట్రావు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# చైనా రాజకీయ ఎత్తుగడలు

### పాక్, నేపాల్‌లను ఎగదోస్తూ వ్యూహాలు
### సరిహద్దు వివాదాల్లో మునిగేలా డ్రాగన్ చిచ్చు

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ):చైనా కుత్సిత బుద్దితో నేపాల్‌ను కూడా తన అవసరాలకు సమిధగా వాడుకుంటోంది. భారత్ నేపాల్ మధ్య సరిహద్దు వివాద చిచ్చు పెట్టి ఆనందిస్తోంది. ఇటీవల నేపాల్ కొత్త మ్యాప్‌ను ఆమోదించడం, భారత్‌ను ఎదరించి మాట్లాడడం చూస్తే నేపాల్ ఎంతగా చైనా ఉచ్చులో పడిందో గమనించ వచ్చు. అక్కడ ఉదారవాద కమ్యూనిస్టులు అధికార పగ్గాలు చేపట్టిన తరవాత జరిగిన పరిణామంగా దీనిని గుర్తించాలి. నేపాల్ రాజకీయ మ్యాపులో మార్పులకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆ దేశ పార్లమెంటు ప్రతినిధుల సభ ఇటీవల ఏకగ్రీవంగా ఆమోదించడంతో చిరకాల మిత్ర దేశాల మధ్య వివాదం రాజుకునేలా చేయడంలో చైనా విజయం సాధించింది. భారత్ భూభాగాలకు చెందిన కాలాపాని, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలను కొత్త మ్యాపులో నేపాల్ చేర్చడం ద్వారా భారత్‌తో కయ్యానికి సై అంది. దీనికి కొనసాగింపుగా ఇటీవలే బీహార్‌లో ఓ సరిహద్దు గ్రామంలో దాడిచేసి రైతులను చితకబాదింది. ఓ రైతు మృతికి కారణమయ్యింది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌ను పునర్విభజన చేస్తూ భారత్ కొత్త రాజకీయ మ్యాపు విడుదల చేసినందుకు ప్రతిగా నేపాల్ ఈ చర్యకు పూనుకుంది. ఈ మూడు వివాదాస్పద ప్రాంతాలపై హక్కు తమకు ఉందంటూ నేపాల్ ప్రకటించడం వెనక చైనా ఉందన్నది నిర్వివాదం. దక్షిణాసియా ప్రాంతీయ సహకార కూటమి (సార్క్)లో సభ్యదేశాలుగా ఉన్న ఈ రెండు ఇరుగుపొరుగు దేశాల మధ్య వాణిజ్య, సహకార విస్తరణకు ఒప్పందాలు ఉన్నాయి. కానీ, సరిహద్దు వివాదాల పరిష్కారానికి ఎలాంటి ఒప్పందమూ లేదు. రాజకీయ మ్యాపులపై వివాదం మొదలై ఎనిమిది మాసాలు గడిచినా, దీనిపై భారత్, నేపాల్ మధ్య ఒక్కసారి కూడా చర్చలు జరగలేదు. రెండు సార్లు తాము చర్చల తేదీలను ప్రతిపాదించినా భారత్ పట్టించుకోలేదని నేపాల్ అంటోంది. నేపాల్‌తో చర్చలు, సంప్రదింపులకు తాము సుముఖంగానే ఉన్నామని, నేపాల్ పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టడానికి ముందు కూడా చర్చల ప్రతిపాదన చేశామని, ప్రధాని ఓలి ఏకపక్ష ధోరణేఖ ఈ వివాదానికి కారణమని మోడీ ప్రభుత్వం ఆరోపించింది. ఇరు దేశాల మధ్య అపోహాలు, అనుమానాలు ఏవైనా తలెత్తినప్పుడు ఉభయ దేశాల నేతలు పరస్పరం చర్చించుకుని, పరిష్కరించు కోవాలని 1950 నాటి ఒప్పందం స్పష్టంగా చెబుతోంది. అయితే చైనా అండగతో నేపాల్ కూడా తోక జాడిస్తోంది. భారత్‌తో పోల్చితే నేపాల్ చాలా చిన్న దేశం. ఆర్థికంగా కూడా బలహీనమైన దేశం. వివిధ రంగాల్లో భారత్‌పైనే బాగా ఆధారపడి జీవిస్తోంది. శాంతి స్నేహ ఒప్పందం తరువాత రెండు దేశాల ప్రజల మధ్య ప్రత్యేక బాంధవ్యం ఏర్పడింది. భారత్‌లో 80 లక్షల మంది నేపాలీయులు నివసిస్తుండగా, నేపాల్‌లోని తెరాయిలో 40 లక్షల మంది దాకా భారత్ నుంచి వలస వెళ్లి స్థిరపడినవారు ఉన్నారు. వీరికి నేపాల్ పౌరసత్వం కూడా లభించింది. పాస్‌పోర్టులు, వీసాల అవసరం లేకుండానే రెండు దేశాల మధ్య స్వేచ్ఛగా రాకపోకలు సాగించుకునే వీలుంది. భారత్‌లో నివసించే నేపాలీయులు ఇక్కడి పౌరులతో సమంగా విద్య, వైద్య సదుపాయాలను పొందడంతో బాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. నేపాల్ వాణిజ్యంలో మూడోవంతు భారత్‌పై ఆధారపడి ఉంది. రెండు దేశాల మధ్య బంధం విడదీయరానిది. ఈ నేపథ్యంలో కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలను భారత్ తన అధీనంలోని భూ భాగంగా పేర్కొంటూ రాజకీయ మ్యాపును ప్రచురించడంతో ఇరు దేశాల సంబంధాల్లో కొత్త దశ మొదలైంది. నేపాల్‌పై చైనా ప్రభావం పెరుగుతున్న క్రమంలోనే అది ఇలాంటి వివాదాలను ముందుకు తెస్తోంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగడం చైనాకు అవసరం. పాక్ సరిహద్దుల్లో, నేపాల్ సరిహద్దుల్లో వివాదాలు సాగాలని అది కోరకుంటోంది. అందుకే భారత్ తమపై దాడి చేయదన్న ధీమాతో చైనా ఉంది.

# పచ్చదనం ఓసం మరితహారం కార్యక్రమం

### గ్రామాల,పట్టణాల అభివృద్దిలో నేతలు పోటీ పడాలి
### మొక్కల పెంపకంపై మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): పట్టణ,పల్లె ప్రగతి కార్యక్రమాలతో ఇప్పుడు గ్రామాల్లో పారిశుద్య పనులు నిత్యకృత్యంగా సాగుతున్నాయి. కరోనాతో ఈ కార్యక్రమం ఒకింత తప్పనిసరి చేయడంతో నిరంతరంగా పారిశుద్య పనులు సాగుతున్నాయి. సర్పంచ్‌లు అధికారులు పర్యవేక్షణలో ఇవి సాగుతున్నాయి. తెలంగాణ సాధించిన స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి ముందుకు సాగాలన్న సిఎం కెసిఆర్ పిలుపుతో ముందుకు సాగుతున్నాయి. కార్యక్రమం ప్రారంభమైనప్పుడు కొంతమంది సర్పంచ్‌లు నిరాశతో ఉన్నారని ఈ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత పక్కగ్రామాల్లో గ్రామాల అభివృద్ధి, సర్పంచ్‌పై పెరుగుతున్న గౌరవంతో అందరు ముందుకువస్తున్నారు. రాజకీయాలకతీతంగా అందరు కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మొట్టమొదటి విధి పారిశుద్యంతో మొదలు పచ్చదనం కూడా ముఖ్యమన్నారు. పరిసరాల కాలుష్యం నివారించాలంటే చెట్టు నుంచి వచ్చే ఆక్సిజన్ ముఖ్యమన్న దీన్ని గుర్తించిన కేసీఆర్ 230కోట్ల మొక్కలను హరితహారం కార్యక్రమంలో నాటాలని ఉద్యమంగా చేపట్టారు. దీనికి తోడు హరితహారం కార్యక్రమం మరో రెండురోజుల్లో ప్రారంభం కానుండగా మంత్రి కెటిఆర్ రివ్యూలు చేస్తూ అందరినీ ఉత్సాహపరుస్తున్నారు. గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటేందుకు ప్రతి గ్రామంలో ఒక నర్సరీ ఏర్పాటు చేసారు. ఎన్నడు లేనివిధంగా జిల్లాల్లో పల్లె ప్రగతిలో భాగంగా నిధులు కేటాయించారు. మంచి ప్రగతి సాధించిన గ్రామాలకు ఇంటెన్సివ్‌గా రూ.8 కోట్లు వచ్చాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్‌మోడల్‌గా ఉందని నేతలు అంటున్నారు. పట్టణ ప్రజానీకం కూడా స్థానిక కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు అందరు మమేకమై చేయి చేయి కలిపి వార్డులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకునే పనిలో పడ్డారు. కోవిడ్. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పల్లెల్లో గుణాత్మక మార్పు తీసుకురావడం కోసమే సీఎం కేసీఆర్ పల్లె ప్రగతి,పట్టణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణ రాకముందు సీమాంధ్ర పాలనలో ఆకలిచావులు, కటికచీకట్లు, బీడు భూములే కనపడేవని ఇప్పుడు ఆకలిచావులు లేవు, సంక్షేమ రంగంలో 50వేల కోట్లు ఖర్చుపెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఇతరదేశాలు, రాష్ట్రాల గురించి మాట్లాడటం గాకుండా మన రాష్ట్రం గురించి ఇతరులు మాట్లాడేలా ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రగతి కార్యక్రమాన్ని రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం కావడంతో గ్రామప్రజల మధ్య ఐక్యత పెరిగిందన్నారు. అలాగే నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పన్నుల వసూళ్లను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తుండటంతో స్థానిక సిబ్బందిపై ఒత్తిడి పెరిగి వసూళ్లపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తాజాగా హరితహారం కోసం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు.

# ఉభయ జిల్లాల వర ప్రదాయిని సీతారామ ప్రాజెక్ట్



### 6.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తాం: మంత్రి పువ్వాడ

భద్రాద్రి కొత్తగూడెం, జూన్18 (ఆర్ఎన్ఎ): ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల వర ప్రదాయిని సీతారామ ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తి చేసి 6.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతకొత్తగూడెంలో రూ.2.20 కోట్లతో ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.70 కోట్లతో కొత్తగూడెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు 2,400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాయని, అవసరం లేకుండా కాలువలు తవ్వారని విమర్శించారు. ఆ కాలువలను సీతారామ డిస్ట్రిబ్యూటరీ కాలువలుగా ఉపయోగిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు ఉన్నారు. ఇదిలావుంటే జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పేదలకు అవసరమైన సేవలకు ఏ విధమైన ఆటంకం ఉండకూడదని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ముఖ్యంగా పేదలకు వైద్య సేవలు అందించే విషయంలో సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పువ్వాడ ఆసుపత్రికి సంబంధించి అనేక సమస్యలను ప్రస్తావించారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి, పేదలకు సరైన వైద్యం అందించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధితో పాటు ప్రస్తుత తరుణంలో కరోనా వైరస్ నివారణ చర్యలు, రానున్న సీజనల్ వ్యాధులతో పాటు అన్నిరకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆర్వి కర్ణన్,జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పాపాలాల్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, డిఎంహెచ్‌ఓ డా. మాలతి తదితరులు పాల్గొన్నారు.

## బీహార్‌లో హవల్దార్ సునీల్‌కు తుది వీడ్కోలు

పాట్నా,జూన్18(ఆర్ఎన్ఎ): లధక్‌లోని గాల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణలో అమరులైన 20 మందిలో ఒకరై హవల్దార్ సునీల్ కుమార్‌కు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. బీహార్ రాష్ట్రం పాట్నాలోని ఆయన ఇంటికి భౌతిక కాయాన్ని ఆర్మీ అధికారులు చేర్చారు. దీంతో కడసారి చూపునకు స్థానికులు పోటెత్తారు. ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోదీతోపాటు పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు తుది నివాళి అర్పించారు. అనంతరం ఆర్మీ వాహనంలో అంతిమ యాత్ర నిర్వహించారు. వేలాది మంది ప్రజలు ఆ వాహనం వెంట నడిచారు. మానేర్‌లో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

## మాస్కులు ధరించడంపై కర్నాటకలో అవగాహన

బెంగళూరు,జూన్18(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి విజృంభిస్తుండటంతో మాస్కు ధరించడంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కర్ణాటకలో గురువారం 'మాస్క్ డే'గా పాటించారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో అవగాహన నడక నిర్వహించారు. ఆ రాష్ట్రానికి చెందిన పలువురు క్రీడాకారులు, సినీ ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. బెంగళూరులో విధానసౌధ నుంచి కుబ్బన్ పార్క్ వరకు జరిగిన అవగాహన నడకలో సీఎం బీఎస్ యెడియురప్ప పాల్గొన్నారు. ఆయనతో పాటు ఇందులో పాల్గొన్న మంత్రులు, అధికారులు మాస్కులు ధరించారు. వైరస్ నుంచి రక్షణకు మాస్కు ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా యెడియురప్ప తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించకపోయినా, భౌతిక దూరం పాటించకపోయినా రూ.200 జరిమానా విధించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్ణాటకలో 7,500 మందికిపైగా కరోనా సోకగా, సుమారు 94 మంది మరణించారు

## కాంగ్రెస్ కోశాధికారి గూడూరుకు పాజిటివ్

### ఆందోళనలో కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డికి కరోన సోకింది. ప్రస్తుతం ఆయన కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఒళ్ళు నొప్పులు మినహా ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. గాంధీభవన్ కు రెగ్యులర్ గా వచ్చే కాంగ్రెస్ నాయకుల్లో నారాయణ రెడ్డి కూడా ఒకరు. ఈ మధ్య కాంగ్రెస్ నాయకులు జలదీక్ష పేరుతో ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లాలని నిర్ణయించారు. కానీ, ఆ కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకోవడంతో నాయకులంతా గాంధీభవన్ కు చేరుకొని ప్రెస్ మీట్ పెట్టారు. ఇప్పుడు నారాయణ రెడ్డికి కరోనా పాజిటివ్ రావడంతో కాంగ్రెస్ నేతలంతా ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజుల నంచి గాంధీభవన్ కు వచ్చినవారెవరు అనే జాబితాను అధికారులు తీస్తున్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి కావాలి

### డంప్ యార్డులతో వర్మీ కంపోస్ట్ తయారు చేయండి

### ప్రజాప్రతినిధులతో హరీష్ రావు టెలి కాన్ఫరెన్స్

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): జూలై నెలాఖరులోపు ప్రతి గ్రామంలో డంప్‌యార్డు, గ్రేవ్ యార్డు నిర్మాణాలు జరగాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. డంప్ యార్డులలో వర్మీ కంపోస్టు తయారు చేయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను సిద్దిపేట నియోజక వర్గ పరిధిలోని నంగునూరు మండల ఏంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఏంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో హైదరాబాదులోని తన నివాసం నుంచి మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వ హించారు. గ్రామ ప్రగతి, అభివృద్ధి పనుల పురోగతి, కల్లాల నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షించారు. డంప్, గ్రేవ్ యార్డు నిర్మాణాలలో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా పెద్ద శంకరంపేట మొదటి స్థానంలో నిలిచిందని, కానీ నంగునూరు మండలంలో డంప్, గ్రేవ్ యార్డు నిర్మాణాలలో చివరి స్థానంలో ఉన్నామని ఇది అధికారులు, మండల ప్రజాప్రతినిధుల పనితీరుకు నిదర్శనమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీన హరిత హారం కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఉదయం 10 గంటలకు అన్నీ గ్రామాల్లో ఒకేసారి యజ్ఞంలా మొక్కలు నాటేందుకు కావాల్సిన సన్నాహాలు చేపట్టాలని ప్రజాప్రతినిధులకు సచించారు.

## రెండు జిల్లాల్లో భారీగా గుట్కా పట్టివేత

### –పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ రవాణాదారులు

హైదరాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): పోలీసులు దాడి చేసి ప్రభుత్వం నిషేదించిన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వీటిని పట్టుకున్నారు. సిద్దిపేటలో అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడ్డ గుట్కా ప్యాకెట్ల విలువ రూ. 3 లక్షలుగా

సమాచారం. బీదర్ నుంచి టేకుమట్లకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గుట్కాను సీజ్ చేసిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఇదిలావుంటే ప్రభుత్వం నిషేధించిన మత్తు పదార్థాలు సరఫరా చేసినా, విక్రయించినా వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరి తెలిపారు. జిల్లాలోని బాదేపల్లి గ్రామంలో రెండు దుకాణాలపై ప్రత్యేక పోలీసు బృందం జరిపిన దాడులలో సుమారు రూ. లక్షా డెబ్బై వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసు ప్రత్యేక బృందాలు నిరంతరం దృష్టి పెడుతాయన్నారు. వీరిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. నిందితులు బాదేపల్లికి చెందిన దొంతుల విజయ్, మహేష్ లను అదుపులోకి తీసుకుని జడ్చర్ల పీఎస్ లో కేసు నమోదు చేశారు.

## దిగిరాని బంగారం ధరలు

ముంబై,జూన్18(ఆర్ఎన్ఎ): కొండెక్కిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తున్నా పదిగ్రాముల పసిడి ఇంకా 47,000కు పైగానే పలుకుతోంది. ఇండో–చైనా ఉద్రిక్తతలతో పాటు ప్రపంచవ్యాప్తంగా కోవిడ్–19 కేసులు పెరగడంతో గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్ ధరలు నిలకడగానే ఉన్నా ట్రేడర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో దేశీ మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయి.ఎంసీఎక్స్‌లో బుధవారం పదిగ్రాముల బంగారం 439 రూపాయలు తగ్గి 47,128 రూపాయలకు దిగివచ్చింది. ఇక కిలో వెండి 230 రూపాయలు పతనమై 48,100 రూపాయలు పలికింది.

# పశ్చిమ వైకాపాలో రాజకీయ చిచ్చు

### ఎంపి రఘురామకృష్ణంరాజుకు పొగ

### పార్టీ వీడడానికి సిద్ధంగా ఉన్న ఎంపి రాజు

ఏలూరు,జూన్18(ఆర్ఎన్ఎ): వైకాపా ఎంపి రఘురామకృష్ణమరాజును వదులుకోవాలన్న నిర్ణయానికి వైకాపా వచ్చినట్లుగా ఉంది. అందుకే ఎమ్మెల్యేలు, మంత్రులు ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీవ్రంగ ఉంటాయని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు. ఆయన తీరును పార్టీ అధ్యక్షుడు చూస్తూ ఊరుకునే స్థితి లేదన్నారు. అయితే ఇది జిల్లాలో ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు చర్చగా మారింది. వైకాపా ఎంపి రఘురామకృష్ణంరాజు స్వతహాగా వ్యాపారవేత్త కావడం, పార్టీలో మాట్లాడే స్వేచ్ఛ లేకపోవడం, సిఎం జగన్ అపాయింట్‌మెంట్ దొరక్క ప ఓవడం వంటి కారణాలతో తిరుగుబావుటా ఎగురేసే క్రమంలో తనగళాన్ఇన విప్పారు. గతంలో బిజెపిలో ఉన్న ఆయన మళ్లీ అదేగూటికిచేరుతారన్న ప్రచారం ఉంది. బిజెపి హామీతోనే ఆయన గట్టిగానే తన గళాన్ని విప్పారని అంటున్నారు. ఇకపోతే ఈ వ్యవహారాన్ఇన సద్దుమణిగేలా చేయకుండా వైకాపా కూడా అమితుమికి కారణమయ్యాయి. ఆయన పార్లమెంటరీ నియోజకవర్గంలోని వైసీపీ నాయకులే ఎంపీ దిష్టిబొమ్మలు దహనం చేసే స్థాయికి తీసుకెళ్లింది.. ఒక పక్క వైసీపీ నాయకులు.. మరో పక్క కుల సంఘాల నాయకులు విమర్శలతో హాట్..హాట్‌గా మారింది. మంత్రి రంగనాథరాజు, ఎమ్మెల్యేలు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావుపై వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని.. లేదంటే పార్టీని వీడి వెళ్లాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ ఛరిష్మాతో నరసాపురం ఎంపీగా గెలిచి పార్టీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంపై పలువురు నేతలు నిరసన వ్యక్తం చేశారు. మార్టేరు సెంటర్‌లో బుధవారం రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలో తిరగనివ్వబోమనే వరకు వైకాపా నేతలు హెచ్చరించారు. జగన్ భిక్షతో గెలుపొంది నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న ఎంపీని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎంపీ స్థాయిలో ఉండి ఎమ్మెల్యేలపై దిగజారుడుగా మాట్లాడడం బాధాకరమని వైసీపీ నేతలు తప్పుబట్టారు. జగన్మోహనరెడ్డిని చూసే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్న విషయం గుర్తుచేసుకోవాలన్నారు. పార్టీ ఎమ్మెల్యేలను కించపర్చే విధంగా రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సొంత పార్టీని విమర్శించడం అంటే తాను కూర్చున్న కొమ్మను నరుక్కోవడం వంటిదేనని అభిప్రాయపడ్డారు. రఘురామకృష్ణంరాజు కాంగ్రెస్ నుంచి బీజేపీకి, ఆ తరువాత టీడీపీకి ఇప్పుడు వైసీపీకి మారారన్నారు. పార్టీలో ఉండడం ఇష్టం లేకుంటే పార్టీని వీడిపోవాలన్నారు. మొత్తంగా పశ్చిమలో ఇప్పుడు ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మాట్లాడింది.

# రాజకీయ వేడి రగిలించిన మండలి సమావేశం

### ద్రవ్యవినిమయ బిల్లు ఆమోదించకుండానే చరిత్ర

### అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదంతో రాజకీయ రచ్చ

అమరావతి,జూన్18(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో నిన్న బీభత్సం చోటు చేసుకుంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీకి చెందిన సభ్యుల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. శాసనమండలిలో ఈ ఘటనపై రెండు పార్టీలు ఎవరికి వారు తమ వాదన తాము వినిపిస్తున్నాయి. సంఖ్యాబలముందని ప్రతిపక్షం ఇష్టానురీతిగా వ్యవహరించిందని తాము చెప్పినట్లుగానే సభ సాగాలని పట్టుబట్టిందని మంత్రులు ఆరోపించారు. అయితే మంత్రులపై తాము దాడి చేయలేదని వారే ప్రతిపక్ష సభ్యుల వైపు వచ్చి దాడి చేశారని, ఒక మంత్రి అయితతే మహిళా సభ్యులు ఉన్న సభలో తొడకొట్టి, జిప్ తీశారని టీడీపీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక మొత్తం మీద మండలిలో జరిగిన రచ్చ.. సంచలనం రేపింది. ఘటనపై ఎవరి వాదనలు ఎలా ఉన్నా పెద్దల సభలో జరిగిన ఈ చిల్లర వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరింత వేడిని రాజేసింది. దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, సత్యనారాయణ రాజులు బాహాబాహీకి దిగడం కలకలం రేపింది. ఈ గొడవ విషయం మీదా, అలాగే ఎమ్మెల్సీ నారా లోకేష్ వీడియో తీయడం పైనా వైసీపీ సభ్యులు చైర్మన్ కు ఫిర్యాదు చేశారు. చివరికి ద్రవ్య వినిమయ బిల్లును కూడా ఆమోదించకుండానే శాసనమండలి నిరవధిక వాయిదా పడిన తీరు ఓ చరిత్రగా మిగలనుంది. నిజానికి అసలు సభలో ముందుగా ఏ బిల్లు ప్రవేశపెట్టాలనే అంశంపై మండలిలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మూడు రాజధానులు, సీఆర్డీఏ రద్దు బిల్లులపై ముందు చర్చించాలని వైసీపీ పట్టుబట్టింది. మొదట ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించాలని మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ ఎమ్మెల్సీ యనమల డిమాండ్ చేశారు. ద్రవ్య వినిమయ బిల్లు రాజ్యాంగపరమైన తప్పనిసరి కాబట్టి మొదట దానిపై

చర్చించాలని, ఆ తర్వాత సమయాన్ని బట్టి మిగిలిన వాటిపై ఆలోచించ వచ్చన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ కూడా ద్రవ్యవినిమయ బిల్లుపై మొదట చర్చిద్దామన్నారు. ఈ ప్రతిపాదనకు మొదట వైసీపీ మంత్రులు అభ్యంతరం తెలిపారు. మొదట సీఆర్డీఏ, అభివృద్ధి వికేంద్రీకరణ బిల్లులపైనే చర్చించాలని డిమాండ్ చేశారు. దానికి తగ్గట్టే ద్రవ్య వినిమయ బిల్లులు ప్రవేశపెట్టిన తర్వాత మిగిలిన బిల్లులు ప్రవేశపెట్టిన సంప్రదాయం ఎప్పుడూ లేదన్నారు టీడీపీ సభ్యులు. ఈ గందరగోళంలో కొంతసేపు సభ వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన తర్వాత ఇరు పక్షాల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. సభ ఆర్డర్‌లో లేదంటూ డిప్యూటీ చైర్మన్ సభను వాయిదా వేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వికేంద్రీకరణ బిల్లులు, ద్రవ్య వినిమయ బిల్లుల ఆమోదం లేకుండానే సభ వాయిదా పడింది. వాయిదా ప్రకటన అనంతరం అధికార, ప్రతిపక్షాల సభ్యుల మధ్య తోపులాట జరిగింది. టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేష్ ఫొటోలు తీస్తున్నారంటూ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో మంత్రి వెల్లంపల్లిని టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అడ్డుకున్నారు. ఈ సమయంలో బీద రవిచంద్ర, వెల్లంపల్లి శ్రీనివాస్ మధ్య తోపులాటలు చోటుచేసుకోగా మిగిలిన సభ్యులు వీరిని విడదీశారు.

# ఆర్ అండ్ బి పనులకు నరేగా అనుసంధానం

### -ప్రతిపాదనలపై అధికారులతో సమీక్షించిన వేముల

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పనుల్లో మిషనరీ సహాయం లేకుండా మానవ ఆధారితంగా చేయగలిగే పనులు ప్రతిపాదించాలని ఆ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు డిపార్ట్‌మెంట్‌లో మనుషులను ఉపయోగించి చేపట్టబోయే పనులను నరేగా పథకానికి అనుసంధానం చేయడానికి గల అంశాలపై తన కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 27వేల కి.మీ. రాష్ట్ర రహదారులు, 1300 కి.మీ. రాష్ట్రం ఆధీనంలో కల నేషనల్ హై వేరోడ్లు ఉన్నాయని అన్నారు. మొత్తం 27,000 కి.మీ. రోడ్లు ఉన్నాయన్నారు. మెయింటెనెన్స్ స్కీమ్‌లో ఉన్నవి పోను దాదాపు 1300 కి.మీ. రోడ్ల ఇరువైపుల గల బుష్ క్లియరెన్స్ చేయడం, రోడ్డుకు ఇరువైపుల కల షోల్డర్స్‌ని మట్టితో లెవల్ చేయడం వంటివి మిషనరీ సహాయం లేకుండా మానవ ఆధారితంగా చేయగలిగే పనులు ప్రతిపాదించాలన్నారు.

అలాగే వాహన దారులకు కి..మీ. దూరాన్ని చూపించే స్టోన్‌లకు పెయింటింగ్ వేయడం, కల్వర్టులు, బ్రిడ్జిఘాట్‌స్టోన్స్‌కు సున్నం వేయడం వంటి మెయింటెనెన్స్ పనులను కూడా ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైల్వే లెవెల్ క్రాసింగ్ దగ్గర ఉన్న జంక్షన్‌లలో నాలుగు వైపులా ఎప్పటికప్పుడు బుష్ క్లియరెన్స్ షోల్డర్స్‌లెవలింగ్ ,పెయింటింగ్ పనులు కూడా నరేగాకి అనుసంధానం చేసి రోడ్ సేఫ్టీకి దోహదపడే విధంగా పనులు చేయాలి. ఇలా మొత్తం ఈ సంవత్సరం ఆర్‌అండ్‌బి రోడ్ మెయింటెనెన్స్‌లో దాదాపు 200 కోట్ల రూపాయల విలువగల పనులను నరేగాకి అనుసంధానం చేస్తూ అన్నిజిల్లాల కలెక్టర్లకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని మంత్రి ఆదేశించారు. ఈసమావేశంలో ఆర్‌అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావుతదితరులు పాల్గొన్నారు.

# భర్త మృతితో ఎమ్మార్వో సుజాతకు బెయిల్

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): బంజారాహిల్స్ భూ వివాదం కేసులో ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ షేక్‌పేట ఎమ్మార్వో సుజాతకు రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. భర్త అజయ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అనుమతినిచ్చింది. కాగా, ఎమ్మార్వో సుజాత భర్త అజయ్ కుమార్ బుధవారం గాంధీనగర్‌లో భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. సోదరి నివాసానికి వచ్చిన అజయ్ అయిదంతస్తుల భవనం పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న చిక్కడపల్లి పోలీసులు, మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా భూ వివాదం కేసులో అజయ్‌ను కూడా గతంలో ఏసీబీ విచారణ చేసింది. భార్య ఏసీబీకి పట్టుబడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అజయ్ ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం.

# కరోనా చికిత్సల్లో అలసత్వంపై హైకోర్టు ఆగ్రహం

### కేవలం గాంధీకే ఎందుకు పరిమితం చేశారు

### నిమ్స్ వంటి ఆస్పత్రులను ఎందుకు దూరం పెట్టారు

### కరోనాను ఎదుర్కొనే సన్నద్ధత తగినంతగా కనిపించడం లేదు

### పిపిఇ కిట్స్‌పై నివేదిక సమర్పించాలని ఆదేశం

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు పెంచాలని మూడు వారాలుగా చెబుతూనే ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కరోనా చికిత్సలు గాంధీకే పరిమితం చేశారని.. నిమ్స్ వంటి ఆస్పత్రులను ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించింది. మీడియా బులెటిన్లలో కరోనా గణాంకాలు గజిబిజిగా ఉంటున్నాయని.. కరోనాను ఎదుర్కొనే సన్నద్ధత తగినంతగా కనిపించడం లేదని మండిపడింది. తమ ఆదేశాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని.. తాము మరింత కఠినంగా ఉండాలని ప్రభు త్వం కోరుకుంటే.. అలాగే చేస్తామని వ్యాఖ్యానించింది. ప్రజలే ఎవరి జాగ్రత్తలు వారు తీసుకోవాలన్న ధోరణి ప్రభుత్వంలో కనిపిసో_ందని అసహనం వ్యక్తం చేసింది. వైద్య సిబ్బందికి తగిన కరోనా నివారణ కిట్లు ఇవ్వడం లేదన్న పిల్‌పై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. పీపీఈ కిట్లు, మాస్కులు ఎన్ని వచ్చాయి? సిబ్బందికి ఎన్ని ఇచ్చారో నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వివరాలను రేపటిలోగా సమర్పించాలని గాంధీ, నిమ్స్, ఫీవర్, కింగ్ కోఠి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లకు ఆదేశాలు జారీ చేసింది. వీరు నేరుగా వచ్చి సమాధానం ఇవ్వాలన ఇకూడా తెలిపింది. అదే విధం గా.. గాంధీలో జూనియర్ డాక్టర్ల సమ్మె అక్కడి పరిస్థితికి అద్దం పడుతోందని.. పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, గాంధీ సూపరింటెండెంట్ విచారణకు హాజరు కావాలని ఆదేశించి ంది. ఇక రాష్ట్రంలోని 33 జిల్లాలకు కరోనా విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు.. కరోనా నియంత్రణపై ప్రభుత్వానికి ఆసక్తి, ఉత్సాహం పోయినట్లు కనిపిస్తోందని చురకలు అంటించింది. కంటైన్మెంట్ ప్రాంతాల్లో ఇంటింటికీ పరీక్షలు ఎందుకు నిర్వహించడం లేదు... పరీక్షలు చేయకుంటే కరోనా వ్యాప్తి తీవ్రత ఎలా తెలుస్తుందని ప్రశ్నించింది.

# దేశ రక్షణలో రాజీపడేది లేదు

### కేంద్రానికి అంతా బాసటగా నిలవాల్సిందే

### కరోనా కట్టడిలో మంచి ఫలితాలు సాధిస్తున్నాం

### ప్రధాని మోడీతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం కెసిఆర్

హైదరాబాద్,జూన్18(ఆర్ఎన్ఎ): దేశ రక్షణ విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని, దేశ మంతా ఒక్కతాటిపై నిలవాలని, ఈవిషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలుస్తారని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భారత్–చైనా సరిహద్దులో జరిగిన ఘర్షణ అంశాన్ని కేసీఆర్ ప్రస్తావించారు. చైనా గానీ, మరే దేశం కానీ భారత్ సార్వభౌమత్వం విషయంలో వేలు పెడితే తప్పక ప్రతిఘటించాలని, తగిన సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి అన్నారు. దేశ రక్షణ విషయంలో ఎవరూ రాజకీయం చేయాల్సిన అవసరం లేదని, దేశమంతా ఒక్కతాటిపై నిలబడాల్సిన సమయం ఇదని సీఎం అభిప్రాయపడ్డారు. వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభంలో ప్రధాన మంత్రితోపాటు అందరు ముఖ్యమంత్రులు లడాఖ్ ప్రాంతంలో జరిగిన ఘర్షణలో చనిపోయిన సైనికులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. కెసిఆర్, మంత్రి ఈటెల రాజేందర్ , సిఎస్ సోమేశ్ కుమార్,డిజిపి మహేందర్ రెడ్డి తదితరులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కరోనా నివారణలో శక్తివంచన లేకుండా కృషి

కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు తమ ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని సీఎం కేసీఆర్ అన్నారు. హైదరాబాద్, దానికి అనుకున్న ఉన్న జిల్లాల్లో మాత్రమే కొత్త కేసులు వస్తున్నాయని చెప్పారు. అక్కడ కూడా త్వరలోనే వైరస్ వ్యాప్తి కంట్రోల్ అవుతుందన్నారు. దేశంలో కరోనా పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నివారణకు చేపడుతున్న చర్యలను సీఎం కేసీఆర్ వివరించారు. ప్రస్తుతం కరోనా అదుపులోనే ఉందని, మరణాల రేటు కూడా తక్కువగానే నమోదవుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా సాగిస్తున్న పోరుతో కరోనాపై విజయం సాధిస్తామన్న విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు సీఎం కేసీఆర్. తెలంగాణలో హైదరాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లో మాత్రమే కరోనా కేసులు నమోదవుతు న్నాయని, ఇక్కడ కూడా వ్యాప్తి నివారణకు గట్టిగా కృషి చేస్తున్నామని చెప్పారు. కొద్ది రోజుల్లోనే వైరస్ వ్యాప్తి కంట్రోల్‌లోకి వస్తుందని, మళ్లీ మామూలుగా జీవించే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి కూలీలు, కార్మికులు, హమాలీలు మళ్లీ పని చేసుకోవ డానికి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని, వారికి అవకాశం కల్పించాలని సీఎం కేసీఆర్ కోరారు. దేశమ ంతా ఒక్కటే, ఎక్కడి వారు ఎక్కడికి పోయైనా పనిచేసుకునే అవకాశం ఉండాలన్నారు. బీహార్ నుంచి హమాలీలు తెలంగాణకు రావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. బీహార్ నుంచి వచ్చే హమాలీలను అక్కడి ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వారిస్తున్నట్లు వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి సరదాగా స్పందించారు. నితీశ్ గారు, మేము తెలంగాణలో మీ హమాలీలను బాగా చూసుకుంటాం.

# 21న జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్న ప్రధాని

### అన్‌లాక్2పై స్పష్టత ఇచ్చే అవకాశం

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): ప్రధాన మ ంత్రి నరేంద్ర మోదీ మరోసారి ఈ నెల 21న జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈనెల 21న ఆదివారం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తారని అధికారవర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజులుగా దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లతో సమావేశం అవుతున్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ మీద రాష్ట్రాల్లో పరిస్థితులను ఆయా ముఖ్యమంత్రులను అడిగి తెలుసుకుంటున్నారు. కరోనా వైరస్ కంటైన్మెంట్ జోన్లలో కేంద్ర ప్రభుత్వం జూన్ 30 వరకు లాక్ డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. బతుకు బండి కూడా నడవాలన్న కారణంగా అన్ లాక్ 1 పేరుతో భారీగా సడలింపులు కూడా ప్రకటించడంతో దేశవ్యాప్తంగా కరోనా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. కరోనా వైరస్ కంటే ప్రస్తుతం చైనా ఆర్మీ, భారత సైనికుల ఘర్షణలో 20 మంది సైనికులు చనిపోవడం భారతీయులను కలవరపాటుకు గురిచేసింది. చైనా గత కొన్నిరోజులుగా దుస్సాహసానికి ఒడిగడు తోందని ప్రజలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి ఈరోజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అమరజవాన్లకు నివాళి అర్పించారు. వారి పోరాటం, బలిదానాలు వృధాగా పోవని చెప్పారు. భారత్ శాంతి కోరుకుంటుందని, అవసరమైతే దీటుగా బదులిస్తుందని కూడా చైనాకు ఘాటు హెచ్చరిక జారీ చేశారు. మరో టవైపు ఈ అంశంపై 19న ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశం నిర్వహి ంచనున్నారు. ఆ సమావేశం తర్వాత జూన్ 21న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతి నుద్దేశించి ప్రసంగించనున్నారు. ఏడాది జూన్ 21న చాలా ప్రత్యేకమైన రోజు. అదే రోజున ఇంటర్నేషనల్ ఫాదర్స్ డే, ఇంటరే ్నషనల్ యోగా డే, ఇంటర్నేషనల్ మ్యూజిక్ డే ఉన్నాయి. అలాగే, సూర్యగ్రహణం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని దేశానికి సందేశం ఇవ్వబోతున్నారు.

# వైద్య వృత్తి పరమ పవిత్రమైనది

### వైద్య సి బ్బంది దేవుళ్లతో సమానం

### స్టాఫ్‌నర్సులకు నియామకాలు అందించిన మంత్రి

మహబూబ్‌నగర్,జూన్18(ఆర్ఎన్ఎ): సేవ చేసే గొప్ప అవకాశం వైద్య వృత్తి ద్వారా వస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఓ కార్యక్రమంలో నూతనంగా స్టాఫ్ నర్సులుగా ఎంపికైన 160 మందికి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అన్నింటికన్నా విలువైంది ప్రాణమని, ప్రాణాలను కాపాడే వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు, నర్సులు దేవుళ్లతో సమానం అన్నారు. ప్రపంచంలో వైద్య వృత్తి అత్యున్నతమైనది అన్నారు. వృత్తి మీద ప్రేమతో కొత్తగా ఎన్నికైన స్టాఫ్ నర్సులు పనిచేయాలని, ఉదార స్వభావం కలిగి ఉండాలని, పూర్తిస్థాయిలో రోగులకు సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో 2014 సంవత్సరంలో కేవలం 18 మంది డాక్టర్లు, 72 మంది నర్సులు మాత్రమే ఉండగా ప్రస్తుతం 210 మంది డాక్టర్లు, 470 మంది నర్సులు పనిచేస్తున్నారని, మహబూబ్ నగర్ జిల్లా నుంచి వైద్యపరంగా హైదరాబాద్ కు వెళ్లకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. రూ.400 కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాలను నిర్మించామన్నారు. జిల్లాకు కరోనా టెస్టింగ్ ల్యాబొరేటరీ త్వరలోనే వస్తుందని ఆయన పేర్కొన్నారు.

# మొబైల్ లాబోరేటరీని ప్రారంభించిన కేంద్ర మంత్రి




న్యూఢిల్లీ, జూన్ 18: దేశంలోనే మొదటి కొవిడ్–19 మొబైల్ టెస్ట్ లాబోరేటరీని గురువారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ ఢిల్లీలో ప్రారంభించారు. కరోనా టెస్టులు చేసేందుకు, ర్యాపిడ్ రెస్పాన్స్ మొబైల్ లాబోరేటరీని రూపొందించారు. దీన్ని మారుమూల ప్రాంతాల్లో మోహరించనున్నారు. ఇందులో రోజుకు 25ఆర్‌టీపీసీఆర్, 300 ఎలీసా, టీబీ, హెచ్‌ఐవీ పరీక్షలు చేసే సామర్థ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కోవిడ్–19పై పోరాడేందుకు ఫిబ్రవరిలో మొదటి ప్రయోగశాల ప్రారంభిస్తే, ఇప్పటికే దేశవ్యాప్తంగా 953కు చేరాయని, ఇందులో 699 ప్రభుత్వ ప్రయోగశాలలు ఉన్నట్లు తెలిపారు.

# సుప్రీంలో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

### చనిపోయిన వారికీ కరోనా టెస్టులపై స్టే

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ):చనిపోయిన వారికి కరోనా పరీక్షలు చేయాలన్న హైకోర్టు ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హైక్టు ఇచ్చిన ఆదేవాలపై సుప్రీం స్టే విధించింది. చనిపోయిన వారికి కూడా కరోనా పరీక్షలు చేయాలని గతంలో హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ ఆదేశాలపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దానికి సంబంధించిన పిల్ సుప్రీంకోర్టులో నేడు విచారణకు వచ్చింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వ వాదనలు పరిగణలోకి తీసుకున్న జస్టిస్ అశోక్ భూషణ్ ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

# మాస్కోలో జరిగే రెండవ ప్రపంచ యుద్ధం యొక్క 75 వ 'విక్టరీ డే పరేడ్'కు భారత త్రివిధ దళాల బృందం

న్యూ ఢిల్లీ, జూన్ 18:రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించిన 75 వ వార్షికోత్సవం సందర్భంగా రష్యా దాని ఇతర స్నేహపూర్వక ప్రజలు చేసిన వీరత్వం మరియు త్యాగాల గౌరవార్థం మాస్కోలో సైనిక కవాతు నిర్వహించనున్నారు.

ఈ యుద్ధం విజయ దినోత్సవం సందర్భంగా మే 9, 2020 న రష్యా సమాఖ్య అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ అభినందన సందేశం పంపిన సంగతి తెలిసిందే. విజయ దినోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగుకు అభినందన సందేశం పంపారు. ఈ నెల 24 న మాస్కోలో జరగనున్న 'విక్టరీ డే పరేడ్'లో పాల్గొనడానికి రష్యా రక్షణ మంత్రి ఒక భారతీయ బృందాన్ని ఆహ్వానించారు. ఈ కవాతులో పాల్గొనడానికి భారత్ నుంచి త్రివిధ దళాలలోని 75 మందితో కూడిన ఒక బృందాన్ని పంపడానికి రక్షణ మంత్రి తన సమ్మతి తెలియజేశారు. ఈ కవాతులో ఇతర దేశాల సభ్యులు కూడా పాల్గొననున్నారు. కవాతులో పాల్గొనడం ద్వారా గొప్ప దేశభక్తి యుద్ధంలో వీరులను రష్యా ప్రజలు గుర్తుచేసుకుంటున్న సమయంలో వారికి నివాళీ మరియు తగిన సంఘీభావం తెలిపిన సంఘటనగా ఇది గుర్తుండిపోనుంది.

# పూరీ జగన్నాథ రథయాత్రకు సుప్రీం బ్రేక్

### భక్తులు లేకుండా రథయాత్రకు కూడా వీల్లేదన్న కోర్టు

### కరోనా వేళ అనుమతిస్తే దేవుడూ క్షమించడని వ్యాఖ్య

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): ప్రతియేటా అత్యంత వైభవోపేతంగా జరిగే పూరీ జగన్నాథుడి రథయాత్రకు సుప్రీం అడ్డుకట్ట వేసింది. కరోనా నేపథ్యంలో ఈ యేడు అలాంటి ప్రయత్నం చేయకపోవడమే మేలని వ్యాఖ్యానించింది. రథయాత్రపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భక్తులు లేకుండా రథయాత్రను నిర్వహ ఇంచడాన్ని కూడా సుప్రీం అనుమతించలేదు. ప్రస్తుతం కరోనా విపత్తు నేపథ్యంలో రథయాత్రను నిర్వహించకపోవడమే మేలని వ్యాఖ్యానించింది. ప్రస్తుత పరిస్థితుల్లో రథయాత్ర నిర్వహణకు మేం అంగీకరిస్తే.. ఆ జగన్నాథుడు మమ్మల్ని క్షమించడు.. అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ ఏ బోబ్డే స్పష్టం చేశారు. కరోనా మహమ్మారి కారణంగా జగన్నాథుడి రథయాత్రను, దానికి సంబంధించిన కార్యకలాపాలను ఈ సంవత్సరం అనుమతించబోమని కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. జూన్ 23 న ప్రారంభం కానున్న రథయాత్రను వాయిదా వేయాలంటూ ఓ పిటిషనర్ సుప్రీంకోర్టు మెట్లెక్కారు. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం.. రథయాత్రకు సంబంధించిన అన్ని కార్యకలాపాలపై స్టే విధించారు.

ఈ యేడాది పూరీ జగన్నాథుని రథయాత్రను అశేష భక్తజనం లేకుండానే నిర్వహిస్తామని మే నెలాఖరున శ్రీ జగన్నాథ్ ఆలయ కమిటీ ప్రభుత్వానికి సూచించిన సంగతి తెలిసిందే.. ఆలయ కమిటీ నిర్ణయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఒడిశా సర్కార్.... రథయాత్ర సందర్భంలో ప్రత్యేకంగా రైళ్లు వేయాల్సిన అవసరం ఏమీ లేదని కేంద్ర రైల్వే శాఖకు తేల్చి చెప్పింది. లక్షలాది భక్తుల వీక్షణార్థం అన్ని మీడియా ఛానళ్లలోనూ రథయాత్రను ప్రత్యక్ష ప్రసారం చేయాలని, అప్పుడు భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని వివిధ పండుగలు, ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. కరోనా నేపథ్యంలో భక్తులు లేకుండానే రథను నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు. రథయాత్రపై తుది నిర్ణయం మాత్రం ప్రభుత్వానిదే అని ఆలయ కమిటీ అధ్యక్షుడు గజపతి మహారాజా అన్నారు. కాగా.. భక్తులు లేకుండా రథయాత్రను నిర్వహించేందుకు కూడా తాజాగా సుప్రీం కోర్టు నో చెప్పింది.. సుప్రీం తీర్పును బట్టి శ్రీ జగన్నాథ్ ఆలయ కమిటీ ఏం చేయబోతోందో వేచిచూడాలి.

# భారత ఒలింపిక్ పనితీరు ఇంకా విస్తరించేలా (కెఐఎస్సిఈ) ను ఏర్పాటు చేయడానికి క్రీడా మంత్రిత్వ శాఖ సన్నద్ధం : శ్రీ కిరణ్ రిజిజు

హైదరాబాద్, జూన్ 18:ప్రధానమైన ఖేలో ఇండియా పథకం కింద ఖేలో ఇండియా స్టేట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (కిస్సిఇ) ను ఏర్పాటు చేయడానికి క్రీడా మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉంది. మొత్తం రాష్ట్రంలో ఒక బలమైన క్రీడా పర్యావరణ వ్యవస్థను రూపుదిద్దే ప్రయత్నంతో ప్రతి రాష్ట్ర, కేంద్ర పరిథిల్లొ ఒక కెఐఎస్సిఈ ని గుర్తిస్తారు. మొదటి దశలో, కర్ణాటక, ఒడిశా, కేరళ, తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్లతో సహా భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని క్రీడా సౌకర్యాలను మంత్రిత్వ శాఖ గుర్తించింది. వీటిని ఖేల్ ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా స్థాయి పెంచుతారు.

రాష్ట్రాల్లో క్రీడా సౌకర్యాలను బలోపేతం చేసే ఈ ప్రయత్నం గురించి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి శ్రీ కిరణ్ రిజిజు మాట్లాడుతూ, "ఒలింపిక్స్‌లో రాణించాలన్న భారతదేశ ప్రయత్నాన్ని బలోపేతం చేయడానికి ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటైంది. భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలో లభించే అత్యుత్తమ క్రీడా సౌకర్యాలను ప్రపంచ స్థాయి ప్రమాణాల అకాడమీలుగా పెంచడం మా ప్రయత్నం, ఇక్కడ దేశవ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు తమ నిర్దిష్ట విభాగంలో శిక్షణ పొందాలనుకుంటున్నారు. ప్రభుత్వ కమిటీ లోతైన విశ్లేషణ తర్వాత క్రీడా సౌకర్యాలు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు అన్ని ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్లలో, ప్రత్యేకంగా ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు సాధించగల ఉన్నత క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి ఇది సరైన దిశలో ఒక అడుగు అని నాకు నమ్మకం ఉంది. " అని శ్రీ కిరణ్ రిజుజు అన్నారు. క్రీడా సౌకర్యాలు ఎంపిక చేసే విధానం అక్టోబర్ 2019 లో ప్రారంభమయ్యాయి. పరిశీలించిన 15 ప్రతిపాదనలలో, ప్రాధాన్యత క్రీడల మౌలిక సదుపాయాల లభ్యత, కేంద్రం తయారు చేసే ఛాంపియన్లలో లభించే శిక్షణా సౌకర్యాల ఆధారంగా 8 ప్రతిపాదనలు తుది ఎంపికగా ఖరారయ్యాయి.

సమగ్ర అధ్యయనం తర్వాత సూచించిన అవసరానికి అనుగుణంగా, ఖరారు చేసిన వాస్తవ మొత్తం ఆధారంగా ఎనిమిది కేంద్రాలకు గ్రాంట్ ఇవ్వబడుతుంది. బ్రాడ్–బేస్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కోసం, రాష్ట్రాలు, యుటిలు ప్రతి క్రీడలో ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేస్తాయి, దీని కోసం కేంద్రం నిధులు అందుతాయి. అథ్లెట్ల పనితీరు స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలకు మెరుగుపడేలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నైపుణ్యం, వనరులు, పర్యవేక్షణ వ్యవస్థను విస్తరిస్తుంది.

మొదటి బ్యాచ్‌లో, ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఈ కింద వాటి స్థాయి పెంచుతారు:

సంగే లాడెన్ స్పోర్ట్స్ అకాడమీ, ఇటానగర్, అరుణాచల్ ప్రదేశ్
జైప్రకాష్ నారాయణ్ నేషనల్ యూత్ సెంటర్, బెంగళూరు,కర్ణాటక
జివి రాజా సీనియర్ సెకండరీ స్పోర్ట్స్ స్కూల్, తిరువనంతపురం, కేరళ
ఖుమాన్ లంపక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇంఫాల్, మణిపూర్
రాజీవ్ గాంధీ స్టేడియం ఐజావాల్, మిజోరాం
కళింగ స్టేడియం , భువనేశ్వర్, ఒడిశా
స్టేట్ స్పోర్ట్స్ అకాడమీ ఐజి స్టేడియం, కోహిమా, నాగాలాండ్
రీజినల్ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట, తెలంగాణ.

# ప్రధానమంత్రి భారతీయ జనౌషధి కేంద్రాల్లో ఒక్క రూపాయికే శానిటరీ నాప్‌కిన్లు

### జూన్ 10, 2020 నాటికి 3.43 కోట్లకు పైగా శానిటరీ నాప్‌కిన్ల అమ్మకం

న్యూ ఢిల్లీ, జూన్ 18:ప్రస్తుత కొవిడ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ధరకే శానిటరీ నాప్‌కిన్లను అందుబాటులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న 6,300 ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పీఎంబీజేపీ) కేంద్రాల్లో కేవలం ఒక్క రూపాయికే ఒక్కో ప్యాడ్‌ను విక్రయిస్తోంది. మార్కెట్‌లో ఈ తరహా ప్యాడ్ల ధర రూ.3 నుంచి రూ.8 వరకు ఉంది.శానిటరీ నాప్‌కిన్లు అందుబాటులోకి తెచ్చిన జూన్ 4, 2018 నుంచి జూన్ 10, 2020 వరకు 4.61 కోట్ల నాప్‌కిన్లు జనౌషధి కేంద్రాల్లో అమ్ముడయ్యాయి. ఆగస్టు 27, 2019వ తేదీన ధరను సవరించిన తర్వాత, 3.43 కోట్లకు పైగా ప్యాడ్లను విక్రయించారు.మహిళలు ఆరోగ్యకర రుతుస్రావ పద్ధతులు పాటించడానికి సామాజికపరంగా, మతపరంగా కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, యువతులకు శానిటరీ ఉత్పత్తులు అందుబాటులో ఉండడం లేదు. వీటి ధర కాస్త ఎక్కువగా ఉండడం వల్ల చాలామంది వీటిని ఉపయోగించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనిని గమనించిన కేంద్ర ప్రభుత్వం, నిరుపేద మహిళ ఆరోగ్య రక్షణ కోసం "స్వచ్ఛత, స్వస్థ్య, సువిధ" కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ లక్ష్యమైన 'అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన ఆరోగ్య రక్షణ' దిశగా.. కేంద్ర ఔషధ విభాగం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ శానిటరీ న్యాప్‌కిన్లు పర్యావరణహితమైనవి. ఏఎస్‌టీఎం డి–6954 ప్రమాణాలను అనుసరించి, భూమిలో కలిసిపోయేలా తయారు చేశారు.ప్రస్తుత కొవిడ్ సమయంలో దేశ ప్రజలందరికీ అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా జనౌషధి కేంద్రాలు పనిచేస్తున్నాయి. జనౌషధి సువిధ శానిటరీ న్యాప్‌కిన్లు అన్ని జనౌషధి కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 1.42 కోట్ల ప్యాడ్లను విక్రయించారు.

# ఆయుధాలు లేకుండా సైనికులు ఎలా వెళ్లారు?

### రాహులం గాంధీ ట్వీట్

న్యూఢిల్లీ,జూన్18(ఆర్ఎన్ఎ): లధక్‌లోని గాల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణలో తలపడిన భారత సైనికులను ఆయుధాలు లేకుండా ఎవరు పంపారు?.. ఎందుకు పంపారు? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ ఘర్షణలో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందడంపై గురువారం ఆయన మాట్లాడారు. ఆయుధాలు లేని సైనికులను చంపి చైనా ఘోర నేరానికి పాల్పడిందని ఆరోపించారు. భారత సైనికులను ఆయుధాలు లేకుండా ఎవరు పంపారు.. ఎందుకు పంపారన్నది నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. దీనికి బాధ్యులెవరు?' అంటూ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియోలో రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

## ఈ హరితహారంలో 50వేల మొక్కలు నాటడం లక్ష్యంగా

# ముందుకుసాగనున్న కమిషనరేట్ పోలీసులు



కరీంనగర్, జూన్ 18 (నేటినిజం ప్రతినిధి): ఈనెల 20నుండి(రేపటి)నుండి ప్రారంభంకానున్న హరితహారం కార్యక్రమంలో 50వేల మొక్కలను నాటాలనే లక్ష్యంతో కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు ముందుకుసాగనున్నారు. ఈ మేరకు కమిషనరేట్‌లోని పోలీస్‌శాఖకు చెందిన వివిధ ప్రాంతాలు, పోలీస్‌శిక్షణ కళాశాల(పిటిసి)లో 50వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలను రూపొందించారు. హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటడంతోపాటు మియావాకి పద్ధతిలో చిట్టడవులు పెంపకాలను నిర్వహించడంలో సఫలీకృతమై రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్న విషయం విదితమే.

గత 2017లో రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సమక్షంలో 25వేల మొక్కలను నాటి సంరక్షిస్తామని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఇచ్చిన మాటను ఆచరణలో చూపించేందుకు పకడ్బందీ చర్యలను తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఏస్థాయిలో శ్రమిస్తున్నారో అదేస్థాయిలో మొక్కల సంరక్షణ భాద్యతలను కొనసాగిస్తూ ముందుకుసాగుతున్నారు. గత సంవత్సరం జూలై 14 కరీంనగర్‌లోని పద్మానగర్‌లో గల మార్క్‌ఫెడ్ మైదానం ఆవరణలో జరిగిన హరితహారం సందర్భంగా 14ఎకరాల విస్తీర్ణంలో ఏడువేల మొక్కలను నాటారు. మరో 10వేల మొక్కలను సిటిపోలీస్ శిక్షణకేంద్రం(సిపిటిసి)లో, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో 120, మిగతావి వివిధ పోలీస్‌స్టేషన్‌ల ఆవరణలో నాటిన విషయం విదితమే.

మార్క్‌ఫెడ్ ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు మూడు బోర్లను వేసి డ్రిప్ విధానం ద్వారా నీటిని అందిస్తున్నారు. కానుగు, గుల్మోర్, వేప, రావి, జామ, మామిడి మొక్కలను నాటారు. నాటిన మొక్కలు ఇతర జంతువులు మేయకుండా ఉండేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సిటి పోలీస్ శిక్షణ కేంద్రం(సిపిటిసి)లో 20వేల మొక్కలు సంరక్షించబడుతున్నాయి. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ, ఆ మొక్కలకు చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు పోలీస్‌శాఖ, మున్సిపల్ అధికారులు, శాంతి సంక్షేమ కమిటి సభ్యులు పలుగు,పారలు పట్టి శ్రమదానం ద్వారా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. వనాలు అంతరించి మానవమనుగడ ప్రమాదంచటంచుకు చేరడంతో జీవకోటికి ప్రాణాధారం అయిన మొక్కల పెంపకం భాద్యతలను పోలీసులు తీసుకోవడం ఆహ్వానించదగిన పరిణామం.

### మొక్కల పెంపకంకోసం ఏర్పాట్లు పూర్తి

ఈ హరితహారంలో మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కమిషనరేట్ పరిధిలోని వివిధ నర్సరీలలో అందుబాటులో ఉన్న మొక్కలు, వాటి ఎదుగుదలకు అవసరమయ్యే మట్టిని మొక్కలను నాటేందుకు సిద్దం చేసిన ప్రాంతాలకు తరలిస్తున్న విషయం విదితమే. పోలీస్ శిక్షణ కళాశాల(పిటిసి)లో 25వేల మొక్కలు, ఆబాదిజమ్మికుంట, గన్నేరువరం, సిపిటిసి, కమిషనరేట్‌కేంద్రం, పోలీస్‌స్టేషన్ల ఆవరణలో పోలీస్‌శాఖకు చెందిన స్థలాల్లో ఈమొక్కలను నాటనున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన నాటినుండి వారం నుండి 10రోజుల వ్యవధిలో మొక్కలునాటే కార్యక్రమాన్ని పూర్తిచేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఏఏ ప్రాంతాల్లో ఏతరహా మొక్కలను నాటుతున్న విషయాన్ని పోలీస్‌స్టేషన్లు, వివిధ విభాగాలవారీగా నివేదికలను తెప్పించుకున్నారు. పైన పేర్కొన్న వివిధ రకాల మొక్కలతోపాటు వివిధ రకాల పండ్లమొక్కలకుకూడా ఈ హరితహారంలో ప్రాధాన్యతనివ్వనున్నారు.

మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు ఫలితాలు

### మియావాకి చిట్టడవులు, గతంలో సంరక్షించబడిన మొక్కలు (నేడు మహావృక్షాలు)

జీవకోటికి ప్రాణాధారం వనసంరక్షణ. ఆభాద్యతలను విస్మరించి వివిధ రంగాలలో ఎదుగుదలకోసం స్వార్థంతో పనిచేస్తున్న లక్షలాదిమంది వైపు పయనించకుండా దేశపౌరులుగా దేశభవిష్యత్‌కు మనవంతుగా ఏంచేద్దాం? అనే ఆలోచనతో కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు ముందుకుసాగుతున్నారు. తొలుత కరీంనగర్‌లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో 2019 సెప్టెంబర్ 19న 02వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆతర్వాత కరీంనగర్‌లోని సిటి పోలీసు శిక్షణ కేంద్రం(సిపిటిసి)లో ఈ సంవత్సరం ఫిబ్రవరి 03న ఒక ఎకరం విస్తీర్ణంలో 12,500 మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం విదితమే. జపాన్‌కు చెందిన వృక్షశాస్త్రవేత్త మియావాకి తక్కువ భూభాగంలో ఎక్కువ మొక్కలు నాటే పద్ధతిని కనుగొన్నారు. ఈ పద్ధతి ప్రకారం 300గజాల విస్తీర్ణంలో చిన్నపాటి అడవులను తయారుచేయవచ్చని నిరూపించారు. అన్ని వర్గాల ప్రజల సహకారంతో మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. మొక్కలను సంరక్షిస్తూ సమాజాన్ని కాలుష్యం బారినుండి రక్షించాల్సిన భాద్యత ప్రతిపౌరునిపై ఉందనే భాద్యతను గుర్తుచేస్తున్నారు.

### మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకునే పోలీసులకు రివార్డులు

మొక్కల సంరక్షణ భాద్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న పోలీసులకు ప్రోత్సాహకాలను అందజేస్తామని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ప్రకటించారు. పోలీసుల తమతోపాటు తమ కుటుంబసభ్యులను కూడా ఇందులో భాగస్వాములను చేయాలని కోరారు.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### -లాభాలతో ఊగిసలాడి నష్టాల్లోకి పయనం

ముంబై,జూన్18(ఆర్‌ఎన్‌ఎ): దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిసాయి. రోజంతా లాభనష్టాల మధ్య తీవ్రంగా ఊగిసలాడి చివరకు నష్టాలను మూటగట్టకున్నాయి. చివరి అర్థ గంటలో భారీ అమ్మకాలతో కీలక సూచీలు ప్రధాన మద్దతు స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ 97 పాయింట్ల నష్టంతో 33507 వద్ద, నిఫ్టీ 33 పాయింట్లు కోల్పోయి 9881 వద్ద ముగిసాయి. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసిజి, మెటల్ షేర్లు నష్టపోగా, ఆటో,ఐటీ, ఫార్మా లాభపడింది. భారతీ ఇన్‌ఫ్రాటెల్, పవర్ గ్రిడ్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటిసి, శ్రీ సిమెంట్‌లు నిఫ్టీలో భారీగా నష్టపోగా, మారుతి భారీగా లాభపడగా యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ÷నాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐషర్ మెటార్స్ లాభపడ్డాయి. అటు డాలర్‌తో పోలిస్తే రూపాయి 76.22 వద్ద ఎ÷-లాట్‌గా ప్రారంభమై స్వల్ప లాభాలతో ముగిసింది. 4 పైసలు పుంజుకుని 76.16 వద్ద ముగిసింది. మంగళవారం 76.21 స్థాయి వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

# కల్నల్ సంతోష్ త్యాగం వృధాకాదు: బిజెపి

సూర్యాపేట,జూన్18(ఆర్‌ఎన్‌ఎ): దేశం కోసం కల్నల్ సంతోష్ బాబు చేసిన ప్రాణ త్యాగం వృధా కాదని, చిరస్థాయిగా నిలిచిపోతుందని బీజేపీ నేతలు అన్నారు. సూర్యాపేటలో పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్,ఎంపీ ధర్మపురి అరవింద్, వివేక్ వెంకటస్వామి తదితరులు సంతోష్‌కు నివాళి అర్పించారు. ఆయన త్యాగం వీధా కాదన్నారు. ఆయన ఓ గొప్ప దేశ భక్తుడని, ఆయన తల్లిదండ్రులు త్యాగమూర్తులని బిజెపి నేతలు అన్నారు. గురువారం సూర్యాపేటలోని సంతోష్ తల్లిదండ్రులను వారు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంతోష్ చనిపోవడం బాధగా ఉన్నా తమ కుమారుడు దేశం కోసం వీరమరణం పొందాడని తల్లిదద్రులు గర్వపడుతున్నారని అన్నారు. అలాంటి తల్లిదండ్రులకు పాదాభివందనాలని చెప్పారు. సంతోష్ తెలంగాణలో యువతకు స్ఫూర్తిగా నిలస్తారని భావిస్తున్నట్లు చెప్పారు.

# డాక్టర్‌కు రోగికి మధ్య అనుసంధానకర్త నర్సు

### చిరునవ్వుతో రోగులకు స్వాంతన కల్పించాలి

### నర్సులకు నియామక పత్రాలు అందించిన మంత్రి

సిద్దిపేట,జూన్18(ఆర్‌ఎన్‌ఎ): డాక్టరుకు రోగికి మధ్య సంధాన కర్తగా స్టాఫ్ నర్సులు వ్యవహరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. డాక్టరులోని ఒత్తిడిని తగ్గించేలా.. రోగిలోని మానసిక ధైర్యాన్ని పెంచేలా నర్సులు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా.., నర్సుల పెదాలపై చిరునవ్వు ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగించాలన్నారు.

ఏన్సాన్ పల్లి శివారులోని మెడికల్ కళాశాలలో గురువారం ఉదయం నూతనంగా నియామకమైన స్టాఫ్ నర్సులు 289 మంది జీఎన్ఎంలకు హరీష్ రావు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు వీర జవాన్ కల్నల్ సంతోష్ బాబు చిత్ర పటానికి మంత్రి హరీష్ రావు పూలమాలతో నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి స్టాఫ్ నర్సులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ సేవయే.. మాధవ సేవగా.. నర్సులు చేసే విధి.. ఒక తల్లిలా.. ఒక చెల్లిలా.. ఒక తండ్రి లాంటిందని అన్నారు. కరోనా అంటే.. భయపడాల్సిన అవసరం లేదని, కోవిడ్-19 కోసం సిద్ధిపేటలో 10 పడకల ఆసుపత్రిని మంజూరు చేసుకున్నామన్నారు. అతి త్వరలోనే డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని సిద్ధిపేటకు అందుబాటులో తేనున్నామన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగి శారీరకంగా, మానసికంగా బలహీనంగా ఉంటారని, అలాంటి రోగితో.. సిబ్బంది ప్రవర్తించే విధానం బాగుండాలన్నారు. డెలివరీ సమయంలో గర్భిణీకి వచ్చే ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నార్మల్ డెలివరీ చేయాలని ప్రభుత్వం సూచిస్తున్న క్రమంలో.. ప్రసవ వేదనలో ఉండే.. మహిళకు, వారి కుటుంబీకులకు అర్థమయ్యే విధంగా నార్మల్ డెలివరీ ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. మాతా, శిశు మరణాలు పూర్తిగా తగ్గించాలని, సిద్ధిపేటలో ఎన్‌ఐసీయూ, కంగారు పద్ధతిలో వైద్య సౌకర్యాలు ఉన్నాయని, తొందరపడి బయటకు రెఫర్ చేయొద్దని నర్సులకు హరీష్‌రావు సూచించారు. కార్యక్రమంలో స్థానికి నేతలు,అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కరోనా కట్టడిపై మరోమారు అమిత్‌షా సమీక్ష



న్యూఢిల్లీ,జూన్18(ఆర్‌ఎన్‌ఎ): దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి రోజురోజుకి విస్తరిస్తున్నది. కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూ పోతుంది. ఈ నేపథ్యంలో దేశ రాజధాని నగరం ఢిల్లీలో కోవిడ్-19 పరిస్థితిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు

. ఈ సమావేశంలో ఆ రాష్ట్ర సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి నేడు వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటి వరకు ఢిల్లీలో 47,102 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 27,741 యాక్టివ్ కేసులు ఉన్నాయి. వ్యాధి నుంచి కోలుకుని 17,457 మంది డిశ్చార్జ్ అయ్యారు. కోవిడ్-19 కారణంగా ఢిల్లీలో ఇప్పటివరకు 1,904 మంది చనిపోయారు.

# అమరజవాన్లకు కొవ్వొత్తులతో అశ్రునివాళి



కరీంనగర్,జూన్ 18 (నేటినిజం ప్రతినిధి): ఇండియా-చైనా దేశాల సరిహద్దు ప్రాంతం గాల్వాన్‌నది వద్ద సోమవారంరాత్రి, మంగళవారం నాడు జరిగిన హింసాత్మక చర్యల్లో వీరమరణం పొందిన 20మంది జవాన్లకు బుధవారంనాడు కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులను వెలిగించి అశ్రునివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ కె శశాంక,పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఇందిరాచౌక్(తెలంగాణచౌక్)వద్ద రాత్రి 07గంటలకు జరిగింది.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ దేశరక్షణకోసం తమప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరజవాన్ల ఆశయాల సాధనకోసం అన్నివర్గాల ప్రజలు కుల,మత,వర్గవిభేదాలను విడనాడి ఐక్యంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. భరతమాతముద్దుబిడ్డలు దేశంకోసం ప్రాణత్యాగం చేయడం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. దేశభద్రతకు భంగం కలిగిస్తున్న విచ్ఛిన్నకరశక్తులపై కదంతొక్కేందుకు సమాజంలోని ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని చెప్పారు. అమరవీరులైన జవాన్ల త్యాగాలు వృధాపోవని, దేశరక్షణ చర్యల్లో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములుకావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎన్ శ్రీనివాస్(ఎల్‌అండ్‌ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), మున్సిపల్ కమిషనర్ క్రాంతి, ట్రైనీ ఐఏఎస్ అధికారి అంకిత్, ఏసిపిలు అశోక్, విజయసారధి, శంకర్‌రాజు, మదన్‌లాల్, కరీంనగర్ ఎన్‌సిసి9 బెటాలియన్ కల్నల్,కమాండింగ్ అధికారి అజయ్‌కుమార్, సుబేదార్ సునీల్‌కుమార్, హవల్దార్ యోగిందర్, మాజీసైనికులు, సైనికసంక్షేమశాఖ అధికారులు, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, లక్ష్మణ్‌బాబు, విజ్ఞాన్‌రావు, తుల శ్రీనివాసరావు, ఆర్‌ఐలు మల్లేశం, జానీమియా, శేఖర్, మురళీలతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన పోలీసుఅధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛందసేవాసంస్థలకు చెందిన ప్రతినిధులు సామాజికదూరంపాటిస్తూ పాల్గొన్నారు.

**రామడుగులో**

రామడుగు మండలకేంద్రంలోని అంబేద్కర్‌విగ్రహం వద్ద ఎస్‌ఐ గొల్లపల్లి అనూష ఆధ్వర్యంలో వీరజవాన్లకు పోలీసులు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. స్వేరోస్‌సంస్థ నిర్వాహకులు,విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**హుజురాబాద్‌లో**

హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌విగ్రహం వద్ద పోలీసులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలకు చెందిన ప్రతినిధులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి ఎస్ శ్రీనివాసరావు, ఇన్స్‌పెక్టర్ మాధవిలతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కమిషనరేట్‌లోని వివిధ డివిజన్ల ఏసిపి కార్యాలయాలు, వివిధ పోలీస్‌స్టేషన్లలో అమరవీరులకు నివాళులర్పిస్తూ కార్యక్రమాలను నిర్వహించారు.

# రెడ్ జోన్ లో సేవలందించిన పారిశుధ్య కార్మికులకు సత్కారం



వేములవాడ, జూన్ 18 (నేటినిజంప్రతినిధి):నగరంలోని 52వ డివిజన్ ముకరంపుర ఏరియాను మార్చి 23న కోవిడ్-19 లాక్డౌన్ సమయంలో రెడ్ జోన్ గా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు వారి ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు.

గురువారం వారి సేవలకు గుర్తింపుగా సయ్యద్ అబ్దుల్ రహీం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్‌చైర్మన్ సయ్యద్ అబ్దుల్ కరీం ఒక పూట బిర్యానీ భోజనం వితరణ చేశారు. కార్మికులకు చీరలు, టవ్వాల్లతో సత్కరించారు. ఈసందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ కార్మికుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి సేవలకు గుర్తింపు గా ఈకార్యక్రమం చేపట్టి వారిని గౌరవ ప్రదంగా సత్కరించటం జరిగిందన్నారు. వారి సేవలకు దక్కిన అరుదైన గౌరవం తో కార్మికులు ఉబ్బి తబ్బిబ్బయ్యారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ అక్తర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ అహ్మద్ ఖాన్, ఆఫీస్ అడ్మిన్ సయ్యద్ అబ్దుల్ అలీమ్, ట్రస్ట్ సభ్యులు సయ్యద్ అహ్మద్, షేక్ ఆసీఫ్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అబ్దుల్ హాకీమ్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడను విస్మరించిన సిఎం కెసిఆర్

### యాదాద్రికే పరిమితమయిన అభివృద్ధి

### ఆలయం ముందు ఆందోళనకు దిగిన మాజీ ఎంపి పొన్నం


రాజన్న సిరిసిల్ల,జూన్18(ఆర్‌ఎన్‌ఎ): వేములవాడ ఆలయ అభివృద్ధికి ఇచ్చిన హామీని సిఎం కెసిఆర్ మరచి పోవడం దారుణమని మాజీ ఎంపి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడకు వచ్చిన సందర్భంలో దీనిని దక్షిణ కాశిగా అభివృద్ధి చేస్తమాని అన్నారని గుర్తు చేశారు.

ఈ మేరకు గురువారం ఆలయం ముందు కార్యకర్తలతో కలసి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు.

ప్రతి ఏడాది వంద కోట్ల రూపాయలు ఇస్తామని గత ఐదేళ్ల క్రితం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రభాకర్ ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పేరిట ఉన్న గుడి చెరువు పూడ్చడం తప్ప టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదని విమర్శించారు. యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధిలో దూసుకుపోతుందని, వేములవాడలో మాత్రం ఒక పని కూడా చేయలేదని మండిపడ్డారు. వీటీడీఏ హైదరాబాద్ కార్యాలయానికి కూడా దేవస్థానమే డబ్బులు చెల్లిస్తుండగా, యాదాద్రి డెవలప్‌మెంట్ అథారిటీకి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని తెలిపారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఎన్నికై ఏడాది గడుస్తున్నా.. వేములవాడ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రికి ఒక్క లేఖ కూడా రాయలేదని దుయ్యబట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ఆయన వెంటనే సీఎం కేసీఆర్‌ను కలవాలని డిమాండ్ చేశారు. వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు జర్మనీకే అంకితం అయ్యారని ధ్వజమెత్తారు. వచ్చేనెల లోపు ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించకపోతే గాడిదకు వినతపత్రం ఇస్తామని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి...

### -పలు సేవా కార్యక్రమాలు చేసిన టి ఆర్ కె ట్రస్ట్




వేములవాడ, జూన్ 18 (నేటినిజంప్రతినిధి):ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటూ తన వంతు సహాయం చేస్తున్నారు టి ఆర్ కె ట్రస్ట్... గురువారం టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ ఎన్నారై తోట రామ్ కుమార్ గారి జన్మదిన సందర్బంగా టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు వేములవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రంలోని బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.


ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ మాట్లాడుతూ తోట రామ్ కుమార్ గారి జన్మదినం సందర్భంగా రక్తదానం చేశామని తెలిపారు. అలాగే యువత రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలవాలని తెలిపారు. అలాగే వృద్ధాశ్రమం లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె.వి మహేష్ రెడ్డి, తోట దీపక్, విజయ్ యాదవ్, ప్రతాప్, సంతోష్ గౌడ్, సందీప్ గౌడ్, ప్రదీప్, ప్రేమ్, రాకేష్, మణికంత, అన్వేష్, సన్నీత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

హైదరాబాద్ , జూన్ 18: జిల్లాలోని ముధోల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డిని ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కోరారు. హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో అవసరమున్న చోట అదనపు తరగతి గదులకు నిధులివ్వాలని కోరారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ, మరుగు దొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కాగా, స్పందించిన మంత్రి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని ఈ మేరకు హామీ ఇచ్చారు.

# అమ్మా క్యాంటీన్ల ద్వారా చెన్నైలో ఉచితంగా ఆహారం



చెన్నై, జూన్ 18: తమిళనాడు సీఎం కే పళనిస్వామి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. లాక్‌డౌన్ కాలంలో చెన్నై మెట్రోపాలిటన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలకు అమ్మా క్యాంటీన్ల ద్వారా ఉచితంగా ఆహారం అందిస్తామని గురువారం తెలిపారు.

ఆ రాష్ట్రంలో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్న చెన్నైతో పాటు పలు ప్రాంతాల్లో ఈ నెల 19 నుంచి 30 వరకు పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ అమలు చేస్తున్నట్లు సీఎం కే పళనిస్వామి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం నుంచి పది రోజుల పాటు మళ్లీ లాక్‌డౌన్ విధించనున్నారు. ఈ నేపథ్యంలో పేద ప్రజలు ఇబ్బంది పడకుండా అమ్మా క్యాంటీన్ల ద్వారా ఆహారం అందించాలని నిర్ణయించారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.